# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 27, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) బుధవారం - 16 - ఏప్రిల్ - 2025


## స్టాలిన్ కీలక నిర్ణయం... రాష్ట్ర స్వయంప్రతిపత్తిపై సూచనలకు కమిటీ




- గవర్నర్‌తో విభేదాల నేపథ్యంలో స్టాలిన్ ప్రభుత్వం నిర్ణయం
- స్వయంప్రతిపత్తి కోసం తీసుకోవాల్సిన చర్యలను సిఫార్సు చేయనున్న కమిటీ
- పెండింగు బిల్లులపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో స్టాలిన్ ప్రభుత్వం నిర్ణయం

2లో

## అలా చేస్తే పాఠశాలల రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తాం



- ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా హెచ్చరిక
- ఏకపక్షంగా ఫీజులు పెంచడం, వేధించడాన్ని సహించేది లేదన్న ముఖ్యమంత్రి
- యాజమాన్యాలు నియమ, నిబంధనలు పాటించాలని సూచన
- ప్రభుత్వానికి ఫిర్యాదులు వస్తే నోటీసులు ఇస్తామన్న ముఖ్యమంత్రి

## ఢిల్లీ, ముంబై రెడ్ జోన్‌లో ఉన్నాయి... ఢిల్లీలో మూడ్రోజులు ఉంటే జబ్బు ఖాయం


2

పరిస్థితి ఇలాగే ఉంటే ప్రజల ఆయుర్దాయం తగ్గుతుందన్న గడ్కరీ

ప్రజలు శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించాలని సూచన

## ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు..

# పార్టీ లైన్ దాటితే ఊరుకునేది లేదు

### ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ వార్నింగ్

- పదవులు ఎవరికి ఇవ్వాలనేది అధిష్టానం చూసుకుంటుంది
- మంత్రి పదవి కోరే వాళ్లు మాట్లాడితే వారికే నష్టం
- పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కుంటారు"
- ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'
- సీఎల్పీ సమావేశంలో భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, ఎస్సీ కేటగిరైజేషన్‌పై చర్చ







హైదరాబాద్: పార్టీ లైన్ దాటితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం.. శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన సీఎల్పీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదవులు ఎవరికి ఇవ్వాలనేది అధిష్టానం చూసుకుంటుంది. మంత్రి పదవి కోరే వాళ్లు మాట్లాడితే వారికే నష్టం. ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు. అలా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కుంటారు" అంటూ రేవంత్ తేల్చి చెప్పారు. మంత్రివర్గ విస్తరణపై అధిస్థానం నిర్ణయమే ఫైనల్. మంత్రివర్గ విస్తరణపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదన్నారు. సీఎల్పీ సమావేశంలో భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, ఎస్సీ కేటగిరైజేషన్‌పై చర్చ జరిగింది. ఈ సమావేశానికి పలువురు ఎమ్మెల్యేల డుమ్మా కొట్టారు. వివేక్, ప్రేమ్‌సాగర్‌రావు, రాజగోపాల్‌రెడ్డి గైర్హాజరయ్యారు. సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి" అని పిలుపునిచ్చారు. "ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని కొన్ని సమస్యలకు మన ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. సన్నబియ్యం పథకం ఒక అద్భుతం.. ఆనాడు రూ.2 కిలో బియ్యంలా ఇప్పుడు సన్నబియ్యం పథకం శాశ్వతంగా గుర్తుండే పథకం. భూ భారతిని రైతులకు చేరవేయాలి. దేశంలోనే ఇందిరమ్మ ఇండ్లు పథకం ఆదర్శంగా నిలిచింది. క్షేత్ర స్థాయిలో నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందాలి. దీన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కులగణన ద్వారా వందేళ్ల సమస్యను శాశ్వతంగా పకడ్బందీగా పరిష్కరించాం. విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిల్లులు తీసుకొచ్చాం ఇది మన పారదర్శక పాలనకు నిదర్శనం. జటిలమైన ఎస్సీ ఉపకులాల వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాం. అందుకే వర్గీకరణ జరిగే వరకు ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదు. మనం తీసుకున్న గొప్ప నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉంది. రేపటి నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో మిగతా.. 2లో

## కేసీఆర్ సూచనతోనే

# కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలు

- ప్రభుత్వం ఏర్పడిన వారం నుంచే అధికార దాహంతో కూల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు
- రాష్ట్రంలో పార్టీలు, మతాలు, కులాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది
- అర్హులైన అందరికీ సన్న బియ్యం అందిస్తున్నాం
- ఎస్సీ వర్గీకరణపై ఇప్పటికే జీవోను విడుదల చేశాం
- కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలు.. కుట్రకోణంగా భావిస్తున్నాం: ఆది శ్రీనివాస్



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి, ఇందిరమ్మ ప్రభుత్వానికి ప్రజలు మద్దతిచ్చారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వాన్ని పడగొట్టాలని పలువురు కోరుతున్నా రంటూ భారాస ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా.. 2లో

## వచ్చే ఎన్నికల్లో గెలుపు బీజేపీదే

రేవంత్ సర్కార్‌ను కూలిస్తే బీజేపీకి ఏం లాభం?

తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడి నియామకంపై ఎటువంటి తొందర లేదు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉంది



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందన్నారు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం కూలగొడితే మిగతా.. 2లో



## ప్రధాని మోదీతో కరణం మల్లీశ్వరి భేటీ..

## ఆమె కృషిని కొనియాడిన ప్రధాని

యమునానగర్‌లో ఒలింపిక్ పతక విజేత కరణం మల్లీశ్వరితో ప్రధాని భేటీ. క్రీడాకారిణిగా మల్లీశ్వరి విజయాలు దేశానికి గర్వకారణమన్న ప్రధాని యువ అథ్లెట్లకు మార్గదర్శిగా ఆమె కృషి ప్రశంసనీయమన్న మోదీ

2లో

## ప్రధాని మోడీ అమరావతి

# పర్యటన ఖరారు..

మే 2వ తేదీన అమరావతిలో ప్రధాని నరేంద్రమోడీ పర్యటన



ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమరావతి పునఃనిర్మాణంపై దృష్టిసారించింది.. ఇప్పటికే పలు రకాల పనులకు సీఆర్డీఏ అథారిటీ, ఏపీ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాయి.. అయితే, గతంలో అమరావతి శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ప్రధాని నరేంద్ర మోడీ.. ఇప్పుడు, అమరావతి మిగతా.. 2లో

## దేశంలోనే నెంబర్ 2గా ఆంధ్రప్రదేశ్

- నెం.2 స్థానంలో ఉన్నామంటే మనం ఇంకా గట్టిగా కృషి చేయాలని అర్థం
- అభివృద్ధి పథంలో దూసుకెళుతున్న ఏపీ
- సోషల్ మీడియాలో స్పందించిన సీఎం చంద్రబాబు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2024-25 ఏడాదికి గాను ఆర్థిక వృద్ధి రేటు పరంగా దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. కూటమి ప్రభుత్వం వచ్చిన కొన్ని నెలల్లోనే రాష్ట్రం అభివృద్ధి పరంగా దూసుకెళుతున్నట్టు ఈ జాతీయ నివేదిక చెబుతోంది. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియా




వేదికగా స్పందించారు.

"1990 ప్రాంతంలో నేను మొట్టమొదట ముఖ్యమంత్రిగా వ్యవహరించిన సమయంలో హైదరాబాద్ నగరం రెండో స్థానంలో ఉంది. అప్పుడు బెంగళూరు నెంబర్ వన్ స్థానంలో ఉంది. కానీ ఇవాళ చూస్తే అన్ని రంగాల్లో హైదరాబాద్ నగరం నెంబర్ వన్ అయింది. అదే విధంగా, ఇవాళ మన ముందు ఒక కొత్త సవాలు లేదా కొత్త అవకాశం మన ముందు నిలిచింది. దీన్ని మనం అందిపుచ్చుకుని ముందుకెళ్లాలి. నెంబర్ 2 స్థానంలో ఉన్నామంటే మనం ఇంకా గట్టిగా కృషి చేయాలని అర్థం" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్‌కు

# ఏపీ కేబినెట్ ఆమోదం

### భేటీలో పలు కీలక నిర్ణయాలు



- రూ.617 కోట్లతో అసెంబ్లీ, రూ.786 కోట్లతో హైకోర్టు భవన నిర్మాణాలకు కేబినెట్ ఆమోదం
- నిర్మాణ పనులను ఎల్1 బిడ్డర్‌కు అప్పగించాలి
- స్టేట్ సెంటర్ ఫర్ క్లైమేట్ ఇన్ సిటీస్ వ్యవస్థల ఏర్పాటును ఆమోదించింది
- త్వరలోనే డిఎస్సీ నోటిఫికేషన్

అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ఏపీ కేబినెట్ సమావేశం . ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్‌కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.617 కోట్లతో అసెంబ్లీ, రూ.786 కోట్లతో హైకోర్టు భవన నిర్మాణాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నిర్మాణ పనులను ఎల్1 బిడ్డర్‌కు అప్పగించాలని నిర్ణయించింది. స్టేట్ సెంటర్ ఫర్ క్లైమేట్ ఇన్ సిటీస్ వ్యవస్థల ఏర్పాటును ఆమోదించింది. పట్టణ ప్రాంతాల్లో వరద నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. విశాఖలోని ఐటీహిల్ -3 పైన టీసీఎస్‌కి 21.66 ఎకరాలు, ఉరుస క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కి 3.5 ఎకరాలు కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం. బలిమెల, జోలాపుట్ రిజర్వాయర్ల వద్ద చేపట్టాల్సిన హైడల్ ప్రాజెక్టులకు సంబంధించిన మిగతా.. 2లో


2లో

## ఇరాన్ కు ట్రంప్ వార్నింగ్

## అణ్వాయుధాల సంగతి మరచిపోండి..

లేదంటే మిలటరీ యాక్షన్ కు వెనుకాడబోనన్న అగ్రరాజ్యం అధ్యక్షుడు

న్యూక్లియర్ డీల్ ను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారని ఆగ్రహం

ఇటీవల ఒమన్ వేదికగా ఇరుదేశాల మధ్య చర్చలు

## నోవోటెల్ హెూటల్‌లో సీఎం రేవంత్‌కు తప్పిన ప్రమాదం



శంషాబాద్: శంషాబాద్ నోవోటెల్‌లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి పెను ప్రమాదం తప్పింది. నోవోటెల్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఎక్కిన లిఫ్టులో స్వల్ప అంతరాయం ఏర్పడింది. వాస్తవానికి ఎనిమిది మంది ఎక్కాల్సిన లిఫ్టులో .. ఏకంగా 13 మంది ఎక్కారు. ఓవర్ వెయిట్ కారణంగా ఆ లిఫ్ట్ మొరాయించింది. ఎక్కువమంది ఎక్కడంతో ఉండాల్సిన ఎత్తుకంటే కిందికి లిఫ్ట్ దిగింది. దీంతో ఒక్కసారిగా అధికారులు టెన్షన్ పడ్డారు. అటు హెూటల్ సిబ్బంది, అధికారులు అప్రమత్తమయ్యారు. లిఫ్ట్ ఓపెన్ చేసి సీఎం రేవంత్ రెడ్డిని వేరే లిఫ్టులో సెకండ్ ఫ్లోర్‌కు పంపారు అధికారులు. దీంతో సీఎం రేవంత్ రెడ్డికి నోవాటెల్ లో పెను ప్రమాదం తప్పింది. దీంతో అక్కడ ఉన్న నేతలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.


2లో

హార్వర్డ్‌కు షాకిచ్చిన ట్రంప్...

## 2.2 బిలియన్ డాలర్ల నిధులు నిలిపివేత

అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంపై వైట్ హౌస్ చర్యలు.

2.2 బిలియన్ డాలర్ల ఫెడరల్ నిధులు, 60 మిలియన్ డాలర్ల కాంట్రాక్టులు నిలిపివేత.

క్యాంపస్‌లో యూదు వ్యతిరేకత అరికట్టే డిమాండ్ల తిరస్కరణే కారణం.

# ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు.. పార్టీ లైన్ దాటితే ఊరుకునేది లేదు

మొదటి పేజి తరువాయి



రేపటి నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో ప్రతీ గ్రామం పర్యటించేలా కార్యాచరణ తీసుకోవాలి. నేను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకం అవడానికే సమయం కేటాయిస్తా. హెచ్‌సీయూ భూములపై ప్రతిపక్షం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో ఒక అబద్ధపు ప్రచారం చేసింది. ఈ ప్రచారాన్ని ప్రధాని మోదీ కూడా నమ్మి బుల్డోజర్లు పంపిస్తున్నారని మాట్లాడుతున్నారు. ..బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయి. పార్టీ, ప్రభుత్వం ప్రతిష్ఠ పెరిగితేనే భవిష్యత్ ఉంటుంది. మనం ఎంత మంచి చేసినా.. ప్రజల్లోకి తీసుకెళ్లకపోతే ప్రయోజనం ఉండదు. మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలి.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. మీ నియోజకవర్గంలో ఏం కావాలో ఒక నివేదిక తయారు చేసుకోండి. ఆ పనులను పూర్తి చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. నిన్న మొన్నటి వరకు బండి సంజయ్, కిషన్ రెడ్డి మనపై విమర్శలు చేశారు. ఇప్పుడు ఏకంగా ప్రధాని మోదీనే రంగంలోకి దిగారు. తెలంగాణ పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు. వర్గీకరణ మోదీకి గుదిబండగా మారింది. ..కులగణన మోదీకి మరణశాసనం రాయబోతోంది. దేశంలో తెలంగాణ మోడల్ పై చర్చ జరుగుతోంది. అందుకే తెలంగాణలో కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టాలనే బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటయ్యాయి. సన్న బియ్యం బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలి. సన్న బియ్యం మన పథకం.. మన పేటెంట్, మన బ్రాండ్” అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో గెలుపు బీజేపీదే

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందన్నారు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం కూలగొడితే బీజేపీకి వచ్చే లాభం ఏంటని ఆయన ప్రశ్నించారు. తొందరపడి తెలంగాణలో ప్రభుత్వాన్ని కూలగొట్టమని కిషన్‌రెడ్డి చెప్పుకొచ్చారు. ప్రభుత్వానికి ఐదేళ్ల సమయం ఉంది. ప్రభుత్వాన్ని కూల గొట్టడానికి గుజరాత్ వ్యాపారులకు పని లేదా? వ్యాపారులు వాళ్ళ వ్యాపారాలు వాళ్ళు చేసుకుంటున్నారు అని వ్యాఖ్యానించారు. తాజాగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టే ఉద్దేశ్యం మాకు లేదు. దీంతో, బీజేపీకి వచ్చే లాభమేమీ లేదు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉంది. అది అందరికీ తెలుసు. వచ్చే ఎన్నికల్లో గెలుపు బీజేపీదే. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడి నియామకంపై ఎటువంటి తొందర లేదు. త్వరలో కొత్త అధ్యక్షుడి నియామకం జరుగుతుంది. భూముల అమ్మకం, మద్యం అమ్మకం, అప్పులు తేవడంలో తెలంగాణను నంబర్ వన్‌గా మార్చారు. అర్ధరాత్రి ఫ్లడ్ లైట్లు పెట్టీ ఇలా చెట్లు నరికిన ఘటనలు దేశంలో తెలంగాణలో తప్ప ఎక్కడ జరగలేదు. హెచ్‌సీయూలో చెట్లు కొట్టిన ఏ1 వీడియో పోస్టుపై కేసు పెడితే పెట్టుకోండి. భావితరాలకు ల్యాండ్ కాపాడాల్సిన బాధ్యత మనపైన ఉంది. భూములు అమ్మకం ద్వారానే ప్రభుత్వం నడపాలని అనుకోవద్దు. రేవంత్ ఏ బ్రాండ్ అనేది వచ్చే ఎన్నికల్లో తేలుతుంది. నేషనలిజమే నా బ్రాండ్. ప్రాజెక్ట్ పూర్తి కాకుండా ఎస్ఎల్‌బీసీపై నేషనల్ డ్యాం సెక్యూరిటీ అథారిటీకి ఎలా ఫిర్యాదు చేస్తాం?.. సింగరేణి కార్మికులకు ఐటీ పన్నులు మేం అధికారంలోకి వస్తే రియింబర్స్ చేస్తాం. సింగరేణి కార్మికులు ప్రాణాలకు తెగించి పనిచేస్తారు. వాళ్లది వైట్ కాలర్ జాబ్ కాదు.

సన్నబియ్యంపై..

ఏ రాష్ట్రంలోనైనా ఆ రాష్ట్ర ప్రజల అవసరానికి అనుగుణంగా ఇస్తాం. కొన్ని రాష్ట్రాల్లో గోధుమలు కూడా సరఫరా చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న కోటా కాకుండా ప్రతీ లబ్దిదారుడికి అదనంగా ఐదు కేజీల సన్న బియ్యం ఇచ్చి చూపించాలి. దొడ్డు బియ్యం పైసలతోనే సన్న బియ్యం ఇస్తున్నారు. దీంట్లో కొత్తగా ఏముంది? అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికలలో తమిళనాడులో నష్టపోయామని.. అక్కడ పొత్తుకు వెళ్లాం. య అధ్యక్షుడిగా నా పేరు ప్రచారంపై అటువంటి ప్రస్తావనే లేదు. దక్షిణాదికి లోక్ సభ సీట్లు తగ్గుతాయనేది గాలి ప్రచారం మాత్రమే. అన్యాయంగా వక్ఫ్ పేరుతో ఆక్రమించిన భూముల కోసమే కొంతమంది ఆందోళనలు చేస్తున్నారు. ఎంఐఎం నేతలు, అక్రమంగా లబ్ది పొందిన వారే ఆందోళనల్లో ఉన్నారు. ఏ ఒక్క సామాన్య, పేద ముస్లిం కూడా ఆందోళన చేయడం లేదు. వక్ఫ్ సవరణ చట్టం మీద భూ బకాసురులు ఉద్యమం చేస్తున్నారు. ముస్లిం ప్రార్థన మందిరాలను, వక్ఫ్‌కు సంబంధం లేదు’ అని అన్నారు.

## కేసీఆర్ సూచనతోనే కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలు

మొదటి పేజి తరువాయి



తమ ప్రభుత్వం ఏర్పడిన వారం నుంచే అధికార దాహంతో కూల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీలు, మతాలు, కులాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని పొంగులేటి తెలిపారు. అర్హులైన అందరికీ సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై ఇప్పటికే జీవోను విడుదల చేశామన్నారు. “భూభారతి’ వచ్చాక కొత్త ప్రభాకర్‌రెడ్డి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. గతంలో అక్రమంగా భూములు కొల్లగొట్టారు. వాటిని భూభారతి ద్వారా ప్రభుత్వం తిరిగి తీసుకుంటుంది. అందుకే ఆయన భయాందోళనకు గురవుతున్నారు. కేసీఆర్ సూచన మేరకే ప్రభాకర్‌రెడ్డి ఆ వ్యాఖ్యలు చేశారు. 400 ఎకరాల భూమిని ప్రభుత్వం వెనక్కి తీసుకోవడాన్ని భారాస నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. భూభారతితో పేదల ఆస్తులను తిరిగి పేదలకు పంచుతాం. ఇందిరమ్మ ప్రభుత్వాన్ని కూలుస్తామని పగటి కలలు కంటున్నారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి కేసీఆర్ ఆత్మ. ఈ ప్రభుత్వంపై మొదటి నుంచి కుట్రలు జరుగుతున్నాయి. వెంటనే సీఎం అయిపోవాలని తండ్రి, కుమారుడు చూస్తున్నారు” అని పొంగులేటి వ్యాఖ్యానించారు.

కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలు.. కుట్రకోణంగా భావిస్తున్నాం: ఆది శ్రీనివాస్

భారాస ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఖండించారు. ప్రభుత్వాన్ని పడగొట్టాలనే యత్నాన్ని కుట్రకోణంగా భావిస్తున్నామన్నారు. ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలపై విచారణ జరిపించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరతామని చెప్పారు. కుట్రకోణం ఉన్నట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# బంగ్లాదేశ్ అంటే ఇష్టం ఉన్నవాళ్లు అక్కడికే వెళ్లండి..

## దీదీపై యోగీ ఫైర్



బెంగాల్: బెంగాల్ హింసాకాండపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ బెంగాల్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేశారు. అమర యోధుడు రాజా నర్పతి సింగ్ విజయోత్సవం సందర్భంగా మంగళవారం హర్దోయ్ జిల్లాలోని రుయా గర్హిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం యోగి మాట్లాడుతూ.. అల్లరిమూకలను శాంతి దూతలుగా మమతా బెనర్జీ పిలుస్తారని అన్నారు. బంగ్లాదేశ్ అంటే ఇష్టం ఉన్నవాళ్లు బంగ్లాదేశ్‌కు వెళ్లాలని అన్నారు. అల్లరి మూకలకు కర్ర ఒక్కటే మందు అని.. దయ్యాలు మాటలతో ఏకీభవించవని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. వారం రోజులుగా బెంగాల్‌లోని ముర్షిదాబాద్ మొత్తం కాలిపోతోంది. కొంతమంది బంగ్లాదేశ్‌కు మద్దతు ఇస్తే అక్కడికి వెళ్లి ఉండాల్సింది. ఓ పక్క బెంగాల్ కాలిపోతుందని.. అయినా ముఖ్యమంత్రి పనిలేకుండా కూర్చున్నారన్నారు. సుప్రీం కోర్టు జోక్యంతో కేంద్ర బలగాలు భద్రతా ఏర్పాట్లను చేపట్టాయని.. అందుకు నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు. మాఫియా ఖాళీ చేసే భూమిలో ఆసుపత్రులు నిర్మిస్తామని యోగి అన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని మనమందరం నమ్మాలి. ఇది నవీన భారతదేశం.. 2047లో భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద శక్తిగా మారడాన్ని ఎవరూ ఆపలేరు అన్నారు.

## ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్‌కు

# ఏపీ కేబినెట్ ఆమోదం



అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ఏపీ కేబినెట్ సమావేశం . ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్‌కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.617 కోట్లతో అసెంబ్లీ, రూ.786 కోట్లతో హైకోర్టు భవన నిర్మాణాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నిర్మాణ పనులను ఎల్1 బిడ్డర్‌కు అప్పగించాలని నిర్ణయించింది. స్టేట్ సెంటర్ ఫర్ క్లైమేట్ ఇన్ సిటీస్ వ్యవస్థల ఏర్పాటును ఆమోదించింది. పట్టణ ప్రాంతాల్లో వరద నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. విశాఖలోని ఐటీహిల్ -3 పైన టీసీఎస్‌కి 21.66 ఎకరాలు, ఉరుస క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కి 3.5 ఎకరాలు కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం. బలిమెల, జోలాపుట్ రిజర్వాయర్ల వద్ద చేపట్టాల్సిన హైడల్ ప్రాజెక్టులకు సంబంధించిన నిర్మాణాలపై ఒడిశా పవర్ కన్సార్టియమ్‌కు కూడా రాష్ట్ర కేబినెట్ ఆమోదం. 30 మెగావాట్ల సామర్థ్యంతో 2 హైడల్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం జలవనరుల శాఖ చేసిన ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదంవివిధ ప్రాంతాల్లో పవన విద్యుత్, సౌర విద్యుత్ ప్లాట్ల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం

త్వరలోనే డిఎస్సీ నోటిఫికేషన్

మంత్రివర్గ నిర్ణయాలను నిమ్మల రామానాయుడు మీడియాకు వివరించారు. త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలోగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 26న మత్స్యకార భరోసా సాయం కింద లబ్ధిదారులకు రూ.20వేలు పంపిణీ చేస్తామన్నారు. “ రాష్ట్రంలో టీసీఎస్ విస్తరణకు భూమి కేటాయించాలని నిర్ణయించాం. ఐటీని విస్తరించేందుకు మంత్రి లోకేశ్ ప్రయత్నిస్తున్నారు. భూగర్భ కేబుల్ వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నాం. గుంటూరులో ఈఎస్ఐ ఆస్పత్రికి ఉచితంగా భూమి ఇవ్వాలని నిర్ణయించాం. గ్రేహౌండ్స్ విభాగానికి కొత్తవలసలో భూమి కేటాయిస్తాం. రాష్ట్ర వ్యాప్తంగా మంచి రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. తెదేపా అధికారంలోకి వచ్చిన తర్వాతే ప్రజలకు సామాజిక న్యాయం జరిగింది” అని నిమ్మల రామానాయుడు తెలిపారు.

రోస్టర్ అమలుకు కేబినెట్ నిర్ణయం: డోలా బాల వీరాంజనేయ స్వామి

ఎస్సీ ఉపవర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ఎస్సీ ఉపవర్గీకరణలో 200 పాయింట్ల రోస్టర్ అమలుకు కేబినెట్ నిర్ణయం తీసుకుందని చెప్పారు. “విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల ఫలాలు సమానంగా అందేలా చర్యలు తీసుకుంటాం. ఎస్సీ ఉపవర్గీకరణ కింద గ్రూప్-1లో 12 ఉపకులాలకు 1శాతం రిజర్వేషన్ రానుంది. గ్రూప్-2లో 18 ఉపకులాలకు 6.5 శాతం రిజర్వేషన్ అమలు కానుంది. గ్రూప్-3లో 29 ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేషన్ వర్తించనుంది. అన్ని జిల్లాల్లో ఈ ఆర్డినెన్స్ అమల్లోకి వస్తుంది” అని తెలిపారు.

మతకలహాలు సృష్టించాలని కుట్ర: హెూం మంత్రి అనిత

రాష్ట్రంలో మతకలహాలు సృష్టించాలని కుట్రలు చేస్తున్నారని హెూం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేందుకు అనేక కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. తితిదే ఛైర్మన్‌గా పని చేసిన వ్యక్తి చాలా జాగ్రత్తగా మాట్లాడాలి. తితిదేపై బురద జల్లి ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని వైకాపా నేత భూమన కరుణాకర్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు. తితిదేపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఈవో శ్యామలరావు కూడా చెప్పారు. పాస్టర్ ప్రవీణ్ అంశంపై కొందరు కుట్రలు పన్ని ఆరోపణలు చేశారు. సీసీటీవీ ఫుటేజీలను బయటపెట్టేసరికి నోళ్లు మూసుకున్నారు” అని అనిత అన్నారు.

## ప్రధాని మోడీ అమరావతి

# పర్యటన ఖరారు..

మొదటి పేజి తరువాయి



అయితే, గతంలో అమరావతి శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ప్రధాని నరేంద్ర మోడీ.. ఇప్పుడు, అమరావతి పునఃనిర్మాణానికి కూడా రాబోతున్నారు.. మే 2వ తేదీన అమరావతిలో ప్రధాని నరేంద్రమోడీ పర్యటన కొనసాగనుంది.. అమరావతి పునర్నిర్మాణ పనుల్లో భాగంగా మోడీ పర్యటన ఉంటుందని మంత్రులకు తెలిపారు సీఎం చంద్రబాబు నాయుడు.. మూడేళ్లలో శాశ్వత సచివాలయం, అసెంబ్లీ , హైకోర్టు, రహదారులు పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించారు ఏపీ సీఎం. ఇక, ఇంఛార్జ్ మంత్రుల పర్యటనల్లో మూడు పార్టీల నేతల భాగస్వామ్యం ఉండాలని స్పష్టం చేశారు సీఎం చంద్రబాబు నాయుడు.. రెవెన్యూ సంబంధిత అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.. రెవెన్యూ సమస్యల్లో పోలీసుల జోక్యం అంశాలను పరిష్కరించాలన్న సీఎం. సూర్యఘర్ పథకం అమలు మరింత వేగం పెంచాలని దిశానిర్దేశం చేశారు.. వచ్చే నెల 2వ తేదీన ఏపీకి ప్రధాని నరేంద్ర మోడీ వస్తారని ఈ సందర్భంగా మంత్రులకు వివరించారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. కాగా, కేబినెట్ భేటీ ముగిసిన తర్వాత మంత్రులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు సీఎం చంద్రబాబు.. కొన్ని విషయాల్లో ఎన్నిసార్లు చెప్పినా మార్పు రాదా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.. తిరుపతిలో గోవుల మృతిపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అసత్య ప్రచారాన్ని తిప్ప కొట్టడంలో మంత్రులు వైఫల్యం చెందారని మండిపడ్డారు సీఎం.. దేశంలో ఎక్కడా అమలు చేయలేని సంక్షేమ కార్యక్రమాలు మనం అమలు చేస్తుంటే.. ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మంత్రులు విఫలం అవుతున్నారని దుయ్యబట్టారు.. జిల్లాలు యూనిట్‌గా తీసుకొని పార్టీ.. ప్రభుత్వం.. మంత్రులు సమన్వయంతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకుని వెళ్లాలన్నారు.. అంతేకాదు.. ఎన్నిసార్లు చెప్పినా మంత్రుల తీరిలో మార్పు రావడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు.. వ్యక్తిగత కార్యదర్శులు, వోఎస్‌డీలు చేస్తున్న తప్పులు ప్రభుత్వంపై పడుతున్నాయి.. వాటిని సరిదిద్దుకోవాలని హెచ్చరించారు సీఎం చంద్రబాబు.

# సోనియా, రాహుల్‌పై ఈడీ ఛార్జ్‌షీట్!



ఢిల్లీ: కాంగ్రెస్ పార్టీకి మరోసారి చిక్కులు తప్పేలా లేదు. నేషనల్ హెరాల్డ్ కేసులో కీలక మలుపు తిరిగింది. మనీలాండరింగ్‌కు సంబంధించి ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) కీలక ముందడుగు వేసింది .పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోపాటు పలువురు ప్రముఖ కాంగ్రెస్ నేతలపై అధికార యంత్రాంగం ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఇటీవలే రూ.661 కోట్ల విలువైన స్థిరాస్తులను స్వాధీనం చేసుకోవాలని నోటీసులు జారీ చేసిన కొన్ని రోజులకు ముందు చోటుచేసుకోవడం గమనార్హం. తాజాగా ఈడీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయడంతో ఈ కేసు వ్యవహారం మరింత రాజకీయంగా వేడెక్కించనుంది. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో ఈడీ తన ఫిర్యాదును నమోదు చేసింది. నేషనల్ హెరాల్డ్ అనే పత్రిక ద్వారా నిధుల దుర్వినియోగం జరిగినట్టు ఈడీ ఆరోపిస్తోంది. యువ్ ఇండియా, అసోసియేటెడ్ జర్నల్స్ సంస్థల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీల్లో అనేక అనుమానాస్పద అంశాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో అక్రమంగా నిధులు మళ్లించినట్టు ఈడీ అనుమానం వ్యక్తం చేస్తోంది. ఈ కేసు కేంద్రంగా నిలిచిన నేషనల్ హెరాల్డ్ పత్రికను అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ ప్రచురిస్తోంది. ఈ సంస్థ యాజమాన్యం యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు చెందింది. కాంగ్రెస్ నేతలు సోనియా, రాహుల్‌లు ఇందులో కీలక భాగస్వాములుగా ఉన్నట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఈడీ సమాచారం ప్రకారం, గతంలో నవంబర్ 2023లోనే రూ.661 కోట్ల విలువైన స్థిరాస్తులతో పాటు, రూ.90.2 కోట్ల విలువైన %ాజీ% షేర్లను కూడా జప్తు చేసింది. ఇది నేరపూరిత లాభాలను భద్రపరచేందుకు, అభియుక్తులు వాటిని విక్రయించి పారిపోయే అవకాశాలను నిరోధించేందుకు తీసుకున్న చర్యగా తెలిపింది. ఈ మొత్తం వ్యవహారంలో ముడిపడి ఉన్న నేర లాభాల మొత్తం రూ.988 కోట్లు అని ఈడీ అంచనా వేసింది. ఈడీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌పై ఈనెల 25న కోర్టు విచారణ చేపట్టనుంది. రౌస్ అవెన్యూ కోర్టు తదుపరి చర్యలపై రాజకీయంగా తీవ్ర చర్చ జరుగుతోంది. గతంలో ఈ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఈడీ ఎదుట హాజరైన సంగతి తెలిసిందే. అయితే కాంగ్రెస్ పార్టీ మాత్రం ఈ ఆరోపణలను పూర్తిగా ఖండిస్తోంది. ఇది కేంద్రం బహిరంగంగా ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని అడుగులు వేస్తోందని విమర్శిస్తోంది. తాజా ఛార్జ్‌షీట్ దాఖలుతో ఈ వ్యవహారం మరింత వేడెక్కే అవకాశముంది.

## హార్వర్డ్‌కు షాకిచ్చిన ట్రంప్...

# 2.2 బిలియన్ డాలర్ల నిధులు నిలిపివేత

అమెరికా: అమెరికాలోని ప్రముఖ విద్యాసంస్థ హార్వర్డ్ విశ్వవిద్యాలయం, ఫెడరల్ ప్రభుత్వం మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. క్యాంపస్‌లో యూదు వ్యతిరేకతను (యాంటీ-సెమిటిజం) సమర్థవంతంగా అరికట్టడంలో విఫలమైందని ఆరోపిస్తూ , అందుకు అవసరమైన సంస్కరణలను చేపట్టాలన్న ప్రభుత్వ డిమాండ్లను తిరస్కరించినందుకుగాను, ట్రంప్ యంత్రాంగం హార్వర్డ్‌కు భారీ షాక్ ఇచ్చింది. విశ్వవిద్యాలయానికి అందాల్సిన సుమారు 2.2 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 18,300 కోట్లు) ఫెడరల్ నిధులను నిలిపివేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. దీనికి అదనంగా, 60 మిలియన్ డాలర్ల విలువైన ప్రభుత్వ కాంట్రాక్టులను సైతం తక్షణమే స్తంభింపజేసింది. విశ్వవిద్యాలయ పాలనా విధానాలు, నియామక ప్రక్రియలు, ప్రవేశాల పద్ధతుల్లో మార్పులు తీసుకురావాలని, వివాదాస్పదమవుతున్న వైవిధ్య (డైవర్సిటీ) కార్యాలయాలను మూసివేయాలని, అంతర్జాతీయ విద్యార్థుల నేపథ్య పరిశీలనలో ఇమిగ్రేషన్ అధికారులకు పూర్తి సహకారం అందించాలని, అలాగే విద్యార్థులు-అధ్యాపకుల అభిప్రాయాలపై స్వతంత్ర ఆడిట్ నిర్వహించాలనేవి వైట్‌హౌస్ ప్రధాన డిమాండ్లుగా ఉన్నాయి. అయితే, ఈ డిమాండ్లను హార్వర్డ్ విశ్వవిద్యాలయ అధ్యక్షుడు అలాన్ గార్బర్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఇవి విశ్వవిద్యాలయ స్వయంప్రతిపత్తిపై, విద్యా స్వేచ్ఛపై దాడి చేయడమేనని ఆయన అభివర్ణించారు. తమ రాజ్యాంగబద్ధమైన హక్కులను పరిరక్షించుకుంటామని, ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదని విద్యార్థులు, అధ్యాపకులకు రాసిన లేఖలో ఆయన స్పష్టం చేశారు. ప్రైవేటు విశ్వవిద్యాలయాలు ఏమి బోధించాలి, ఎవరిని నియమించుకోవాలనేది ప్రభుత్వం నిర్దేశించజాలదని ఆయన తేల్చిచెప్పారు. హార్వర్డ్ మొండి వైఖరి, అమెరికాలోని ఉన్నత విద్యాసంస్థలలో పాతుకుపోయిన ‘మేము దేనికైనా సమర్థులమనే మనస్తత్వాన్ని’ ప్రతిబింబిస్తోందని ‘ట్రంప్ జాయింట్ టాస్క్ ఫోర్స్ టు కంబాట్ యాంటీ-సెమిటిజం’ విమర్శించింది. ఫెడరల్ నిధులు పొందుతున్న సంస్థలు పౌర హక్కుల చట్టాలను గౌరవించాల్సిందేనని గుర్తుచేసింది. గతేడాది ఇజ్రాయెల్-గాజా యుద్ధం నేపథ్యంలో దేశవ్యాప్తంగా క్యాంపస్‌లలో చెలరేగిన నిరసనలు, యూదు విద్యార్థుల భద్రతపై ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. గతంలో ఇవే ఆరోపణలపై కొలంబియా విశ్వవిద్యాలయానికి 400 మిలియన్ డాలర్ల నిధులు నిలిపివేసినప్పుడు, ఆ సంస్థ ప్రభుత్వ డిమాండ్లకు అనుగుణంగా క్రమశిక్షణా చర్యలు, భద్రతా సంస్కరణలకు అంగీకరించింది. కానీ, హార్వర్డ్ ప్రతిఘటన వైఖరిని అవలంబిస్తోంది. ఈ ప్రతిష్టంభన, అమెరికాలో విద్యాసంస్థల స్వేచ్ఛ, ప్రభుత్వ నియంత్రణల మధ్య ఉన్న సున్నితమైన సమతుల్యతపై మరోమారు దేశవ్యాప్తంగా చర్చకు తెరలేపింది.

## ప్రధాని మోదీతో కరణం మల్లీశ్వరి భేటీ..

# ఆమె కృషిని కొనియాడిన ప్రధాని

ఢిల్లీ: ఒలింపిక్స్‌లో పతకం సాధించి భారతదేశ కీర్తి పతాకాన్ని రెపరెపలాడించిన ప్రముఖ వెయిట్‌లిఫ్టర్, తెలుగు తేజం కరణం మల్లీశ్వరితో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. హర్యానాలోని యమునానగర్‌లో సోమవారం ఈ భేటీ జరిగినట్లు ప్రధానమంత్రి స్వయంగా వెల్లడించారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను, ఫొటోలను ఆయన తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో పంచుకున్నారు. ఒక క్రీడాకారిణిగా కరణం మల్లీశ్వరి సాధించిన విజయాలు దేశానికి ఎంతో గర్వకారణమని ప్రధాని మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆమె అద్భుతమైన ప్రతిభ, పట్టుదలతో అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి గొప్ప పేరు తెచ్చిపెట్టారని కొనియాడారు. క్రీడల్లో ఆమె ప్రస్థానం ఎందరికో స్ఫూర్తిదాయకమని అన్నారు. క్రీడా రంగంలో వ్యక్తిగత విజయాలతో పాటు, భవిష్యత్ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో కరణం మల్లీశ్వరి చేస్తున్న కృషిని కూడా ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రశంసించారు. యువ అథ్లెట్లకు మార్గదర్శకత్వం వహిస్తూ, వారిని ప్రోత్సహించడానికి ఆమె చేస్తున్న ప్రయత్నాలు ఎంతో అభినందనీయమని ఆయన తెలిపారు. క్రీడాకారిణిగా, మార్గదర్శిగా ఆమె సేవలు దేశానికి ఎంతో విలువైనవని మోదీ అభిప్రాయపడ్డారు.

# ఇరాన్ కు ట్రంప్ వార్నింగ్ అణ్వాయుధాల సంగతి మరచిపోండి..

అమెరికా: అణ్వాయుధాలను తయారు చేయాలనే ఆలోచన విరమించుకోవాలని ఇరాన్ ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ అణ్వాయుధాలను కలిగి ఉండటానికి వీల్లేదని ఆయన తేల్చిచెప్పారు. తమకున్న సమాచారం మేరకు ఇరాన్ అణ్వాయుధ తయారీ దాదాపుగా పూర్తిచేసిందని తెలిపారు. ఈ కారణంగానే న్యూక్లియర్ డీల్ ను కుదుర్చుకోవడంలో ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తోందని ట్రంప్ ఆరోపించారు. ఒకవేళ తమ హెచ్చరికలను పెడచెవిన పెట్టి అణ్వాయుధాలను తయారుచేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, ఇరాన్ అణ్వాయుధ తయారీ కేంద్రంపై సైనిక చర్యకూ వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు. గత శనివారం అమెరికా, ఇరాన్ ల మధ్య న్యూక్లియర్ డీల్ కు సంబంధించి ఒమన్ వేదికగా చర్చలు జరిగాయి. చర్చలు ముగిసిన తర్వాత ఇరాన్ ఓ ప్రకటన విడుదల చేస్తూ.. అమెరికాతో అణ్వాయుధ ఒప్పందానికి సంబంధించి చర్చలు సానుకూలంగా, నిర్మాణాత్మకంగా జరిగాయని పేర్కొంది. రెండో దశ చర్చలు వచ్చే శనివారం రోమ్ వేదికగా జరుగుతాయని తెలిపింది. కాగా, ఇరుదేశాల మధ్య అణ్వాయుధ ఒప్పందానికి సంబంధించి చర్చలు ఒబామా కాలం నుంచే జరుగుతున్నాయని, బైడెన్ హయాంలోనూ చర్చలు జరిపినా ఒప్పందం మాత్రం కుదరలేదని విశ్లేషకులు చెబుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇరాన్ ఉద్దేశపూర్వకంగానే ఒప్పందంపై సంతకం చేయడానికి ఆలస్యం చేస్తోందని తాజాగా ట్రంప్ ఆరోపించినట్లు సమాచారం.

## ఢిల్లీ, ముంబై రెడ్ జోన్‌లో ఉన్నాయి...

# ఢిల్లీలో మూడ్రోజులు ఉంటే జబ్బు ఖాయం

ఢిల్లీ: కాలుష్యం విషయంలో ఢిల్లీ, ముంబై నగరాలు రెడ్ జోన్‌లో ఉన్నాయని, దేశ రాజధానిలో మూడు రోజులు ఉంటే అనారోగ్యం పాలవడం ఖాయమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశ రాజధానిలో నివసించే ప్రజల ఆయుర్దాయం పదేళ్లు తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఇప్పటికైనా శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, ఆర్థిక వ్యవస్థకు ఇచ్చే ప్రాధాన్యతను పర్యావరణానికి కూడా ఇవ్వాలని అన్నారు. పెట్రోల్, డీజిల్ కాలుష్యానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. వాహనాలలో ఉపయోగించే ఇంధనంలో మార్పు అవసరమని అన్నారు. భారతదేశం సుమారు రూ. 22 లక్షల కోట్ల విలువైన శిలాజ ఇంధనాలను దిగుమతి చేసుకుంటోందని గుర్తు చేశారు. వాటికి ప్రత్యామ్నాయ ఇంధనాలను వినియోగించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా చేసుకొని భారత్ ముందుకు సాగుతోందని అన్నారు. విద్యుత్, నీరు, కమ్యూనికేషన్ రంగాలలో ప్రపంచస్థాయి సదుపాయాలను కల్పించడంపై దృష్టి సారించిందని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాల లాజిస్టిక్ ఖర్చులు 12 శాతం లోపు ఉంటే మన ఖర్చులు 16 శాతం ఉన్నాయని అన్నారు. వచ్చే ఏడాది చివరి నాటికి మన ఖర్చులను సింగిల్ డిజిట్‌కు తగ్గించేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# స్టాలిన్ కీలక నిర్ణయం...

తమిళనాడు: వివిధ అంశాలపై కేంద్ర ప్రభుత్వం, గవర్నర్‌తో విభేదాల నెలకొన్న నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర స్వయంప్రతిపత్తిపై సూచనలు చేసేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేశారు. స్వయంప్రతిపత్తి కోసం తీసుకోవాల్సిన చర్యలను ఆ కమిటీ సిఫార్సు చేయనుంది. పలు బిల్లుల ఆమోదంపై తమిళనాడు గవర్నర్, ప్రభుత్వానికి మధ్య విభేదాలు ఉన్నాయి. గవర్నర్ ఆమోదం లేకుండానే 10 చట్టాలను ప్రభుత్వం నోటిఫై చేసింది. ఈ బిల్లులపై సుప్రీంకోర్టులో సైతం స్టాలిన్ ప్రభుత్వానికి ఊరట లభించింది. పెండింగులో పెట్టిన 10 బిల్లులు గవర్నర్ ఆమోదం పొందినట్టే భావించాలని భారత అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో వాటికి చట్టబద్ధమైన హెూదా కల్పిస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం స్వయంప్రతిపత్తిపై సూచనల కమిటీని ఏర్పాటు చేయడం గమనార్హం.

# అలా చేస్తే పాఠశాలల రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తాం

ఢిల్లీ: పాఠశాలల అధిక రుసుముల వసూళ్లపై ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తీవ్రంగా స్పందించారు. పాఠశాలల్లో ఏకపక్షంగా ఫీజులు పెంచితే ఉపేక్షించేది లేదని, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. పాఠశాలల్లో ఫీజుల పెంపును నిరసిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. మోడల్ టౌన్‌లోని క్వీన్ మేరీ స్కూల్ యాజమాన్యం విద్యార్థులను వేధింపులకు గురి చేసిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పాఠశాల యాజమాన్యం కొందరు విద్యార్థులను బహిష్కరించినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని తల్లిదండ్రులు ముఖ్యమంత్రి రేఖా గుప్తా దృష్టికి తీసుకురావడంతో ఆమె వెంటనే స్పందించారు. పాఠశాలల్లో ఇష్టానుసారంగా ఫీజులు పెంచడం, విద్యార్థుల తల్లిదండ్రులను వేధించడం వంటి చర్యలను ఎంతమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. ఫీజుల పెంపు విషయంలో పాఠశాలల యాజమాన్యాలు కొన్ని నియమ, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అసాధరణంగా ఫీజులు పెంచరాదని, విద్యార్థులను అకారణంగా వేధించరాదని హితవు పలికారు. నిబంధనలు పాటించని పాఠశాలలపై కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ప్రభుత్వానికి ఫిర్యాదులు వస్తే సంబంధిత పాఠశాలలకు నోటీసులు పంపిస్తామని తెలిపారు. అవసరమైతే రిజిస్ట్రేషన్లు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. పిల్లల హక్కులను కాపాడేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. ప్రతి బిడ్డకు న్యాయం, గౌరవం, సరైన విద్య లభించాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదుపై అధికారులు తక్షణమే స్పందించి దర్యాప్తు జరపాలని, నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు.

# బెట్టింగ్ యాప్‌ల జోలికి వెళ్లొద్దు..

హైదరాబాద్: బెట్టింగ్ యాప్‌ల మోజులో పడి కొందరు ప్రాణాలు పోగొట్టుకుంటున్న ఘటనలు తరచూ వెలుగుచూస్తున్నాయి. ఆన్‌లైన్ బెట్టింగ్‌ల కోసం అప్పులు చేసి, వాటిని తీర్చే దారిలేక చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇదే విషయమై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తాజాగా యువతను హెచ్చరించారు. ఈ సందర్భంగా తన గన్‌మ్యాన్ ఘాతుకాన్ని ఆయన బయటపెట్టారు. తన వద్ద గన్‌మ్యాన్‌గా పనిచేసిన ఓ వ్యక్తి ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లలో చాలా డబ్బు పోగొట్టుకున్నాడట. పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయాడు. వాటిని తీర్చేందుకు దారిలేక భార్యతో పాటు 5, 7 ఏళ్ల వయసు ఉన్న ఇద్దరు పిల్లలను తుపాకీతో కాల్చి చంపాడు. ఆ తర్వాత అదే గన్‌తో తాను కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడని హరీశ్ రావు పేర్కొన్నారు. కనుక బెట్టింగ్ యాప్‌ల జోలికి వెళ్లొద్దని హెచ్చరించారు. ఏ షార్ట్‌కట్ మనకు డబ్బు ఇవ్వదని ఆయన అన్నారు. బెట్టింగ్ యాప్ నిర్వాహకులు వారు డబ్బులు సంపాదించుకోవడానికి వాటిని తీసుకొచ్చారు తప్పితే.. మనల్ని గెలిపించి లక్షాధికారులు చేయడానికి కాదని మాజీ మంత్రి తెలిపారు. అందుకే యువత ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు ఎంత దూరం ఉంటే అంత మంచిదని ఆయన సూచించారు.

## వికలాంగులకు కాలనీని ఏర్పాటు చేయండి : షేక్ పాషావలి



మాచర్ల నియోజకవర్గ ఇన్చార్జ్, వేల్పుల చిన్న గురవయ్య ( శుభోదయం న్యూస్) అర్హులై ఇల్లులేని వికలాంగులకు స్థలాన్ని కేటాయించి ప్రభుత్వమే ఇల్లు కట్టించి ఇవ్వాలని అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షులు షేక్ పాషా వలి ఆధ్వర్యంలో మంగళవారం తాసిల్దార్ బి కిరణ్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. పాషావలి మాట్లాడుతూ పట్టణ పరిధిలోని ప్రధాన రహదారుల వెంట, రవాణా సౌకర్యం ఉండే ప్రాంతంలో వికలాంగులకు స్థలాన్ని కేటాయించి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వికలాంగుల సమస్యలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్న వికలాంగులకు రాయితీలతో కూడిన పథకాలను ప్రభుత్వం మంజూరు చేయాలన్నారు. అనంతరం ఎమ్మార్వో కిరణ్ కుమార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు అన్వర్ భాషా, మరియు అబ్దుల్ కలాం సేవా సమితి వికలాంగుల విభాగం నాయకులు యు అంజిబాబు, ఎం శంకర్, టీవీ నాగేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆవుటిపల్లిలో అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు



ఉంగుటూరు, ఏప్రిల్ 14,గన్నవరం, నియోజకవర్గం- ఇంచార్జ్ సురేష్ ( శుభోదయం న్యూస్): జిల్లా, ఉంగుటూరు మండలంలో మాల మహానాడు ఆధ్వర్యంలో పెద్దవుటపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అంబేద్కర్134 జయంతి వేడుక ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగ ముఖ్య అతిథులుగా ఆత్కూరు ఎస్ఐ సురేష్, ఏఎస్ఐ రామారావు, సర్పంచ్ బాణావతుతిరుపతమ్మ,, ఎంపీటీసీ నన్నం విజయకుమారి, తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కోమవరపు ప్రసాద్, మాల మహానాడు గన్నవరం నియోజకవర్గ అధ్యక్షులు సరిహద్దు ఆంటోని, పొనుగు మాటి ఉదయ్ భాస్కర్, గోగులముడి సాయిబాబు, బంటి, దోప్పల సురేష్,బట్టు ప్రదీప్, జాకబ్, కుమార్, హేమంత్, కౌశిక్, ఎం జగదీష్, శ్యామ్, రాజేష్, పవన్, నితిన్, ఆనంద్, జానేష్, కమల్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పుట్టిన రోజున ఒక మొక్క నాటండి ప్రకృతిని కాపాడండి




గన్నవరం, నియోజకవర్గం- ఇంచార్జ్ సురేష్ ( శుభోదయం న్యూస్):ఏప్రిల్ 15పర్యావరణ పరిరక్షణ లో భాగంగా ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజు నాడు మొక్కలు నాటడాన్ని ఆనవాయితీగా మార్చుకోవాలని రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సుంకర సాంబశివ రాయల్ అన్నారు తమ సొసైటీ ఆధ్వర్యంలో సభ్యులు మిత్రులు పరిచయస్తుల పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆనవాయితీగా మార్చుకున్నమని ఇప్పటివరకు రాణా వెల్ఫేర్ సొసైటీ ద్వారా 700 మొక్కలు నాటడం, కొంతమంది మిత్రులకు మొక్కలను పంపిణీ చేయడం జరిగిందని. రాణా వెల్ఫేర్ సొసైటీ ఏలూరు జిల్లా అధ్యక్షులు షేక్ జాకీర్ హుస్సేన్ పుట్టినరోజు సందర్భంగా కానుమోలు గ్రామంలో మొక్కనాటే కార్యక్రమం చేపట్టాడము జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు సుంకరప్రణవ్ నాయుడు, పీవీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ ప్రతిభ అవార్డు అందుకున్న బాపట్ల రవి



గన్నవరం, నియోజకవర్గం- ఇంచార్జ్ సురేష్ ( శుభోదయం న్యూస్): గన్నవరం ఏప్రిల్ 15 కృష్ణాజిల్లా,గన్నవరం మండలం గన్నవరం స్రవంతి హై స్కూల్ లో తెలుగు ఉపాధ్యాయులు పనిచేస్తున్న బాపట్ల రవి గుంటూరు సదరన్ ప్రైవేట్ లెక్చరర్ టీచర్స్ ఆర్గనైజేషన్ వారు భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ గారి జయంతి సందర్భంగా ప్రతిభ అవార్డు అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్ కి డా: బి.ఆర్ అంబేద్కర్ జాతీయ ప్రతిభ అవార్డును స్థానిక స్రవంతి హై స్కూల్ తెలుగు ఉపాధ్యాయులు బాపట్ల రవికి 13-04-2025 తేదీన గుంటూరు ఆంధ్ర క్రిస్టియన్ కాలేజీ లో డా:బి.ఆర్అంబేద్కర్ జాతీయ ప్రతిభ అవార్డ్ ను మాజీ లక్ష్మణరావు గారి చేతుల మీదుగా తీసుకోవటం జరిగింది. బాపట్ల రవి మాస్టర్ కి స్రవంతి హై స్కూల్ ప్రిన్సిపాల్ కొమ్మినేని రామకృష్ణ గారు ఉపాధ్యాయుని,ఉపాధ్యాయు లు తదితరుల విద్యార్థులు,కేసరపల్లి గ్రామ సర్పంచ్ గారు, పెద్దలు అభినందనలు తెలియజేశారు.

## దోర్నాల మండలం విద్యాశాఖ సమావేశం



దోర్నాల మండలా రిపోర్టర్ ఆవులయ్య (శుభోదయం న్యూస్ ): ప్రకాశం జిల్లాదోర్నాల మండలం దోర్నాల విద్యా శాఖ ఆధ్వర్యంలో మండల విద్యా శాఖ అధికారి బి. మస్తాన్ నాయక్ గారి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయడం అయినది ఈ సమావేశమునకు ముఖ్యఅతిథిగా మండల అభివృద్ధి అధికారి నాసర్ రెడ్డి గారు సమావేశానికి హాజరై మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరమునకు అంగన్వాడీ కేంద్రంలో



ఐదు సంవత్సరాలు నిండినటువంటి పిల్లల వివరాలు తీసుకొని వారికి సంబంధించినటువంటి ఆధార్ కార్డ్ డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్ వంటివి తప్పులు ఉంటే సరి చేయించుకోవాలని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి బి మస్తాన్ నాయక్ గారు మాట్లాడుతూ మాట్లాడుతూ 5 7 8 తరగతులకు ప్రమోట్ అయిన విద్యార్థుల వివరాలు పాఠశాల ఉపాధ్యాయులు తీసుకొని వారిని డ్రాప్ అవుట్ కాకుండా తిరిగి పాఠశాలలు ఉండే విధంగా విధంగా వారి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు పంపాలని తెలిపారు అలాగే మండలంలో ఎక్కువగా విద్యార్థులు వలసలకు వెళుతుంటారని వారిని గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడాలని తెలిపారు ఈ కార్యక్రమం లో అంగన్వాడి సిబ్బంది సచివాలయ సిబ్బంది విద్యాశాఖ సిబ్బంది బడి బయట పిల్లలు ఎవరు ఉండకుండా చూడాలని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి 2 %వీ%. కొండల రావు గారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం క్లస్టర్ ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని తెలిపారు అలాగే క్లస్టర్ స్థాయిలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు వారి పరిధిలోని సచివాలయం సిబ్బందితో మాట్లాడి విద్యార్థుల వివరాలు వారు పాఠశాలలకు వెళుతున్నారా లేదా అని విద్యార్థుల సమాచారం సేకరించి పెట్టుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు అంగన్వాడి సూపర్వైజర్ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు విద్యాశాఖ సిఆర్ఎంటిలో పాల్గొన్నారు.

## గ్రంథాలయం సెస్ (పన్ను) విషయములో సంప్రదింపులు



దోర్నాల మండల రిపోర్టర్ ఆవులయ్య (శుభోదయం న్యూస్ ): ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం శాఖా గ్రంథాలయం దోర్నాల విషయంలో గ్రంథపాలకుడు డి వెంకటసుబ్బారెడ్డి గారి ఆధ్వర్యంలో దోర్నాల మండల ఎంపీడీవో మరియు ఈ ఓ ఆర్ డి గారు అయినా నాసర్ రెడ్డి సారు గారిని కలిసి గ్రంథాలయ సెస్ గురించి అడగడం జరిగినది ఎంపీడీవో గారు సానుకూలంగా స్పందించి తప్పనిసరిగా ఈ నెలలో గ్రంథాలయ సెస్ చెల్లించేటట్లు అందరి పంచాయతీ కార్యదర్శులకు మీటింగ్ ఏర్పాటు చేసి తప్పనిసరిగా చెస్ చెల్లించేటట్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమములో చిన్న గుడిపాడు బీడీ సెల్ నిర్వాకుడు జె శ్రీనివాసులు, వై చెర్లోపల్లి బీడీసీఎల్ నిర్వాకుడు వి శేషి రెడ్డి గంట వానిపల్లి బీడీ సెల్ నిర్వాహకురాలు శ్రీమతి బి ఆదిలక్ష్మి అందరం కలిసి ఎంపీడీవో గారిని కలిసి గ్రంథాలయ చెస్ గురించి అడగడం జరిగిందిఇట్లుతమ విధేయుడుడి వెంకటసుబ్బారెడ్డిగ్రంథ పాలకుడుశాఖ గ్రంథాలయందోర్నాల

## రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మృతిరాలి కుటుంబానికి ఆర్థిక సహాయం



చౌటుప్పల్ ఏప్రిల్ 15 (శుభోదయం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎస్ లింగోటం గ్రామానికి చెందిన డీలర్ జెల్లా పుల్లమ్మ గత కొద్దిరోజుల క్రితం అనారోగ్య కారణంతో మరణించారు వారి కుటుంబానికి జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులకి రూపాయలు 50,000 ఆర్థిక సహాయంని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి కందుల శంకర్, జిల్లా అధ్యక్షుడు ఎలుగల రాజయ్య, చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యలగూడెం వెంకటేష్, జిల్లా కోశాధికారి ఎడ్ల దర్శన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఐతరాజు యాదయ్య, చౌటుప్పల్ డివిజన్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నారాయణపురం మండల అధ్యక్షుడు దూడల బుచ్చయ్య, ఐఎంజి పాయింట్ అధ్యక్షుడు శ్రీ సూర్వి వెంకటేష చౌటుప్పల్ డీలర్లు రేవల్లి సత్యం, వెన్ రెడ్డి సురేష్,గుమ్మడి రాజశేఖర్ రెడ్డి, పబ్బు శ్రీనివాస్ తెలుకుంట్ల రాజేశ్వర్, బొజ్జ వెంకటయ్య, చిలుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మెడి వ్యాలీ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ను ప్రారంభించిన....ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్



గన్నవరం, నియోజకవర్గం- ఇంచార్జ్ సురేష్ ( శుభోదయం న్యూస్): ఏప్రిల్ 15బాపూలపాడు మండలం,హనుమాన్ జంక్షన్ శేరినరసన్నపాలెం గ్రామంలో మెడి వ్యాలీ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ను ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఈ కార్యక్రమం లో ముఖ్య అధితులుగా ప్రభుత్వ చీఫ్, గన్నవరం నియోజకవర్గం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, హనుమాన్ జంక్షన్ ప్రముఖ వైద్యులు డాక్టర్.దుట్ట రామచంద్ర రావు, రాష్ట్ర టీడీపీ మహిళా నాయకులు ముల్పూరి సాయి కళ్యాణి, రాష్ట్ర రైతు నాయకులు వేములపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కొండపాటూరు

### పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో చీఫ్ ఉప్పాల మురళి,(శుభోదయం న్యూస్) : గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండపాటూరు గ్రామంలో వేంచేసి ఉన్న కొండపాటూరు పోలేరమ్మ దేవస్థానంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ శాసనమండలి సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్.మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ దేవస్థానం కు చేరుకోవడంతో పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ ధర్మకర్తలు అధికారులు, కొండపాటూరు పోలేరమ్మ తల్లి దేవస్థానంలో అమ్మవారికి జరుగుతున్న మల్లెల పూజలో భాగంగా విచ్చేసిన వేలాది మంది భక్తులకు అన్న ప్రసాదం అందజేసిన అన్నం సతీష్ ప్రభాకర్.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కి ఘన నివాళులు



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో చీఫ్ ఉప్పాల మురళి (శుభోదయం న్యూస్) : బాపట్ల పట్టణం మండల ఆఫీస్ దగ్గర బీసీ సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ మురళి గౌడ్ ఆధ్వర్యంలో బాపట్ల పట్టణం నియోజకవర్గంలో పలుచోట్ల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కి ఘన నివాళులు అర్పించిన బీసీ సమన్వయ కమిటీ



బాపట్ల జిల్లా చైర్మన్ ఉప్పాల మురళి గౌడ్, బీఎస్పీ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు, బిసి సమన్వయ కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు చిరంజీవిల నరసింహారావు, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ నాయకులు అంబేద్కర్ కి ఘన నివాళులు అర్పించారు,


## బాపట్ల చీల్ రోడ్ సెంటర్లో అంబేద్కర్ కి ఘన నివాళులర్పించిన బీసీ సమన్వయ కమిటీ జిల్లా చైర్మన్ ఉప్పాల మురళి గౌడ్





ఉమ్మడి గుంటూరు జిల్లా,బ్యూరో చీఫ్ ఉప్పాల మురళి, (శుభోదయం న్యూస్): బాపట్ల పట్టణంలో చీల్ రోడ్డు సెంటర్లో అంబేద్కర్ కి ఘన నివాళులు అర్పించిన బిసి సమన్వయ కమిటీ బాపట్ల జిల్లా చైర్మన్ ఉప్పాల మురళి గౌడ్, బి ఎస్ పి పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు, బిసి సమన్వయ కమిటీ జాతర రాష్ట్ర నాయకులు చల్ల రామయ్య, బీసీ సమన్వయ కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు చిరంజీవులు నరసింహారావు, యువత బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బాపట్ల జిల్లా కర్లపాలెం సెంటర్లో..... డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కి ఘన నివాళులర్పించిన బీసీ సమన్వయ కమిటీ నాయకులు



బాపట్ల జిల్లా, (శుభోదయం న్యూస్) : బాపట్ల జిల్లా కర్లపాలెంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా బీసీ సమన్వయ కమిటీ బాపట్ల జిల్లా చైర్మన్ ఉప్పాల మురళి గౌడ్ మాట్లాడుతూ, ఈరోజు అంబేద్కర్ జయంతి వేడుకలు నియోజకవర్గంలో పలుచోట్ల కార్యక్రమాలు జరపడం చాలా సంతోషదాయకం అన్నారు, అదేవిధంగా ఈ రోజున బీసీ నాయకులు కర్లపాలెంలో భారీగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించిన బీసీ సమన్వయ కమిటీ బాపట్ల జిల్లా చైర్మన్ ఉప్పాల మురళి గౌడ్, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్లపాలెం సెంటర్లో అంబేద్కర్ కి పూలమాలలు వేసి జయంతి వేడుకలు జరపడం సంతోషదాయకమన్నారు, అదేవిధంగా బీసీ సమన్వయ కమిటీ బాపట్ల జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను నేటి యువత స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని



కొనియాడారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు, బీసీ సమన్వయ కమిటీ నాయకులు దేవరపల్లి చెంచుబాబు, బి రామకృష్ణ, యాజలి రమేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సేవాకార్యక్రమాలు చేయడం అభినందనీయం మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి



నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్ ): శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ ద్వారా రుణాలను పొందిన ప్రతి అక్కాచెల్లెమ్మ తమ కష్టాన్ని, ప్రతిభను నమ్ముకొని వ్యాపారాలను చేస్తూ ఆర్థికాభివృద్ధి సాధించేందుకు చేస్తున్న కృషి అభినందనీయం అని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని శిల్పా సేవాసమితి కార్యాలయంలో 102 మంది మహిళలకు 15లక్షలా 94వేల రూపాయల విలువగల చెక్కులను రుణాలుగా ఆయన అందజేశారు. ఆనంతరం వివిధ వ్యాపారాలు చేస్తున్న మహిళలు తమ వ్యాపార అనుభవాలను, విజయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల ప్రజలకు శిల్పా కుటుంబం శిల్పా సేవాసమితిని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. నాటి నుండి నేటి వరకు ఎటువంటి లాభాపేక్షలేకుండా నిస్వార్థంగా వివిధ సేవాకార్యక్రమాలను నిరంతరాయంగా చేపడుతున్నానున్నారు. అయినా తమ సేవలను అడ్డుకొనేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ ద్వార రుణాలు పొందిన ప్రతి అక్కాచెల్లెమ్ములు తమ కష్టాన్ని, ప్రతిభను నమ్ముకొని వ్యాపారాన్ని చేస్తూ తమ కాళ్లపై నిలబడుతూ కుటుంబ ఆర్థికాభివృద్ధికి సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. మరింత అభివృద్ధి సాధించి అనేక మంది పేద మహిళలకు ఉపాధికల్పించాలని కోరారు. మహిళలు ధైర్యంగా కుటుంబాన్ని నడిపించేందుకు చేస్తున్న ప్రయత్నం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిను, మేనేజర్ హరిలీల, శిల్పా సీనాసమితి మేనేజర్ లక్ష్మీనారాయణ, సిబ్బంది, మహిళా బ్యాంక్ ఖాతాదారులు పాల్గొన్నారు.

## వృద్దులకు దుప్పట్లు పంపిణి చేసిన సిపిఎం



జీలుగుమిల్లి, (శుభోదయం న్యూస్) : మండలం లోని వంకవారిగూడెం గ్రామంలో మంగళవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వితంతులకు వికలాంగులకు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ, అలాగే భోజనం ఏర్పాటు చేసినట్లు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు తెలిపారు. రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ చంద్రాల శ్రీరాములు సేవ దృక్పథంతో సేవ కార్యక్రమన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఏ రవి చేతులమీదుగా గ్రామం లోని వృద్దులకు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేసిన అనంతరం భోజన సదుపాయం కల్పించమని అన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ సిపిఎం పార్టీ ప్రజ సేవ కోసం అనేక సేవా కార్యక్రమాలు చేస్తుందని గతంలో కూడ పోలవరం ప్రాజెక్టు ముంపు సమయంలో, పేదవాగు ప్రాజెక్టు కట్ట తెగిన సమయం లో నిర్వసితులను ఆదుకోవడంలో సిపిఎం ముందుడుగులో ఉందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరు సేవ దృక్పథంతో ఆలోచన చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఎం మండల కమిటీ సభ్యులు సిరిబత్తుల సీతారామయ్య, తెల్లం హేమంత్, చిట్టి బొమ్మ కొండలరావు, కారం నాగదుర్గ, జిల్లా కమిటీ సభ్యులు గూడెల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## రవీంద్ర హై స్కూలు కరస్పాండెంట్ ఎం.జి.వి రవీంద్రనాథ్ కి డా. బి.ఆర్ అంబేద్కర్ ప్రతిభ అవార్డు.




నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్): స్థానిక నంద్యాల జిల్లా, పార్కు రోడ్డు సమీపంలో గల బాల అకాడమి పాఠశాలలో ఈరోజు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రతిభ అవార్డు గ్రహీత ప్రజాశ్రేయస్సుకై కృషి చేసిన సామాజిక వేత్త మరియు రవీంద్ర హై స్కూలు కరస్పాండెంట్ అయిన ఎం.జి.వి రవీంద్రనాథ్ కి మరియు ప్రిన్సిపల్ శ్రీమతి మాధవీలతకి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రతిభ అవార్డు ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్( ఎస్ పి ఎల్ టి ఓ) వారి ఆధ్వర్యంలో ముఖ్య అతిధులు, మరియు గౌరవ, విశిష్ట అతిధుల సమక్షంలో డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ ప్రతిభా అవార్డు 2025 ప్రధానం చేశారు. ఇందులో భాగంగా ప్రజా శ్రేయస్సుకే విశేష కృషిచేసిన రాయలసీమ వాస్తవ్యులు బాల అకాడమీ డైరెక్టర్ యమ్ .జి.వి.రవీంద్రనాథ్ ఈ అవార్డుకు ఎంపిక కావడంజరిగిందని వారు తెలిపారు.

# ఇరువురి అక్కచెల్లెళ్లకు రూ. 10 వేలు రూపాయలు బహుమతి ఇచ్చిన ఎమ్మెల్యే



జీలుగుమిల్లి, (శుభోదయం న్యూస్) : జీలుగుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతూ మార్చి 2025 లో జరిగిన ఇంటర్ ప్రథమ, సంవత్సరం ఫలితాలలో కళాశాలలో ప్రథమ స్థానాలు పొందిన గెడ్డం పూజకు, గెడ్డం తులసి లను పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు క్యాంపు కార్యాలయంలో సత్కరించి ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాలలో కళాశాలలో ప్రథమ సంవత్సరం హెచ్ ఈ సి గ్రూపులో 500 మార్కులకు 449 మార్కులు సాధించి కళాశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన గెడ్డం పూజను మరియు ద్వితీయ సంవత్సరం లో 1000 మార్కులకు 825 మార్కులు సాధించి కళాశాల ప్రథమ స్థానంలో నిలిచిన గెడ్డం తులసి లను పోలవరం ఎమ్మెల్యే అభినందించి ఇరువురికి విడివిడిగా 10,000/- రూపాయల చొప్పున నగదు బహుమతి ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్తులో మరింత చక్కగా చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని తమ ప్రాంతానికి మంచి పేరు ప్రత్యేకతలు తీసుకురావాలని, ఉన్నత చదువులకు అవసరమైన సహాయ సహకారాలు ఎప్పుడు అందిస్తానని ఎమ్మెల్యే అన్నారు.

## శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ తరుపున కేటీ నరేంద్రకు అభినందనలు వెల్లువ



లేపాక్షి మండల రిపోర్టర్ అమరేష్ (శుభోదయం న్యూస్ ) : రాష్ట్ర మహర్షి వాల్మీకి సంఘం మన గ్రామ యువకుడు కె. టీ. నరేంద్ర ను గుర్తించి జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించిన శుభ సందర్భంగా శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి కమిటీ సభ్యులు మరియు కుల సంఘం నాయకులు గ్రామస్తులు కలిసి శాలువాతో సత్కార%శీ%, చేసి, కేక్ కటింగ్ చేసి స్వీట్ పంచిపెట్టుకొన్నరు. ప్రతి ఒక్కరూ నరేంద్ర కు అభినందనలు తెలియజేశారు. లికమిటీ తరుపున గురుస్వామి ఆశీర్వదిస్తూ అయ్యప్ప అనుగ్రహం తో మరింత ఉన్నత బాధ్యతలు పదవులు అవరోధించాలని మేమందరం కోరుకుంటున్నాము. అని తెలియజేశారు. లిశ్రీ కే.టి నరేంద్ర మాట్లాడుతూ నాకు మీ అందరి ఆశీర్వాదం అభిమానం ఎల్లవేళల ఇలానే వుండాలి అని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని తెయజేశాడు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి కమిటీ సభ్యులు వాల్మీకి సంఘం కులస్తులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి.... వైసీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి తుగ్గలి యం.శ్రీనివాసులు రెడ్డి...



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): కూటమి ప్రభుత్వం 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేయడంలో విఫలం కారణంగా విశ్వసనీయతను కోల్పోతున్నట్లు వైసీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి తుగ్గలి మాజీ తమ్మారెడ్డి తనయుడు యం.శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు.శ్రీనివాసులు రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు లేదా నిరుద్యోగ భృతి, ప్రతి రైతన్నలకు ఏటా ఆర్థిక సహాయం,తల్లికి వందనం,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి నెలకు మహిళకు రూ,1500 తో పాటు గ్యాస్ సిలిండర్లు ఉచితమన్నారు చాలా మందికి డబ్బులు లేదన్నారు , హామీలు అమలు చేయని ప్రభుత్వం మంచి ప్రభుత్వమా ? లేక ముంచే ప్రభుత్వమా ? అని శ్రీనివాసులు రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మీది ప్రజాప్రభుత్వమైతే వెంటనే సూపర్ సిక్స్ అమలు చేయండి, మీరు మంచి చేస్తారని ఓటేశారని.ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకండి" అని శ్రీనివాసులు రెడ్డి కోరారు. అలాగే సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేకపోతే వైఎస్ఆర్సిపి పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

## రైలు పట్టాలపై గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం



గన్నవరం, నియోజకవర్గం- ఇంచార్జ్ సురేష్ (శుభోదయం న్యూస్): ఏప్రిల్ 15 కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం పొట్టిపాడు వద్ద రైలు పట్టాలపై గుర్తు తెలియని యువకుని మృతదేహం లభిమైంది. సేకరించిన వివరాలు ప్రకారం విశాఖపట్నం విజయవాడ రైల్వే లైన్ పై పొట్టిపాడు రైల్వే గేటు సమీపంలో సుమారు 25- 30 సంవత్సరాల మధ్య వయసుగల యువకుడు మృతదేహం రైలు పట్టాలపై పడి ఉన్నట్లు మంగళవారం తెల్లవారుజామున వెలుగు లోకి వచ్చింది. సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడైన యువకుడు ఎత్తు సుమారుగా 5.5, నల్లని జుట్టు, చామన ఛాయ, సామాన్య దేహాదారుద్యము. మృతుడు సిమెంట్ రంగు నిలువు చారలు గల తెలుపు పొడవు చేతుల చొక్క, నీలం మరియు నలుపు రంగు షార్ట్స్, సిమెంట్ రంగు టీ షర్టు ధరించి ఉన్నాడు. మృతుని తాలూకా ఎవరూ లేని కారణముగా మృత దేహమును ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీ నందు భద్రపరిచినట్లు ఏలూరు రైల్వే ఎస్ ఐ పి. సైమన్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ ఫోటోలో ఉన్న వ్యక్తినీ ఎవరైనా గుర్తిస్తే రైల్వే ఎస్సై సెల్: 9988219559 కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని ఎస్సై కోరారు.

## : గ్రామాల ప్రగతే కూటమి ప్రభుత్వ లక్ష్యం



గన్నవరం, నియోజకవర్గం- ఇంచార్జ్ సురేష్ (శుభోదయం న్యూస్): సిమెంట్ రోడ్ల నిర్మాణంతో నూతన శోభను సంతరించుకుంటున్న గ్రామాలు..పండుగ వాతావరణం లో కొత్త రోడ్లు ప్రారంభించిన ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావుబాపులపాడు మండలం, మడిచర్ల, కానుమోలు గ్రామాల్లో ఈరోజు సాయంత్రం నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లకు ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభోత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ ఇటీవల పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు అనే కార్యక్రమం ద్వారా శంకుస్థాపనలు నిర్వహించి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద మడిచర్ల గ్రామంలో రూ 80 లక్షలు అంచనా వ్యయంతో బీటీ అండ్ సిసి రోడ్డు నిర్మాణం చేయడం జరిగిందని, అలాగే రూ 23 లక్షల అంచనా వ్యయంతో కానుమోలు గ్రామం (బీసీ కాలనీ) లో సీసీ రోడ్డు నిర్మాణం చేయడం జరిగిందని, ఈరోజు ఈ రోడ్లను ప్రారంభోత్సవం చేయడం ద్వారా గ్రామ ప్రజలను కలుసుకోవటం చాలా ఆనందంగా ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వ హయాం లో రహదారుల రూపురేఖలు మారుతున్నాయని అభివృద్దే లక్ష్యంగా పాలన




సాగుతుందని తెలిపారు. గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధిగా పనిచేస్తుందని, త్రాగునీరు, సిసి రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం వంటి సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తుందని అన్నారు. గన్నవరం నియోజకవర్గంలో పెద్ద ఎత్తున సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు నిధులు కేటాయించినందుకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి, ఏపీ ఉపముఖ్యమంత్రి మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ గారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## : పిల్లలలో పౌష్టిక ఆహార లోపాన్ని నివారించాలి ఎంపిపి గంగసాని లక్ష్మి ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్ ): మహిళ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌష్టిక ఆహార పక్షోత్సవాలు సందర్భంగా మంగళవారం వెలుగు కార్యాలయంలో అంగన్వాడి సూపర్వైజర్లు గోళ్ల పద్మజ , పార్వతి ల ఆధ్వర్యంలో పౌష్టిక ఆహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినారు .ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంపీపీ గంగసాని లక్ష్మి, ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య, ఎంఈఓ జి కరుణకుమారి లు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు బాలింతలకు చిన్నారులకు పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించినారు. ఆకుకూరలు చిరుధాన్యాలు వంటివి క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, కిశోర బాలికలు ప్రభుత్వం అందించే పాలు, గుడ్లు, ఆకుకూరలు, చేపలు ,మాంసము , డ్రై ఫ్రూట్స్,చిక్కీలు క్రమం తప్పకుండా పౌష్టిక ఆహారం తీసుకోవాలని అన్నారు. పిల్లలలో ఉబకాయ నీ తగ్గించడానికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని అన్నారు. గర్భిణీ స్త్రీలు, కిషోర్ బాలికల్లో ఎనీ మియా,,రక్తహీనత , నివారణ కొరకు ఆరోగ్యశాఖ వారు ఇచ్చే ఐరన్ మాత్రలను, సీ విటమిలను తీసుకోవాలన్నారు. అనంతరం అంగనవాడి సెంటర్లలో అందించే పౌష్టికాహారంతో పలు రకాల వంటకాలు తయారుచేసినారు. హల్వా, జీడిపప్పు రాగి లడ్లు, నూగుల రాగి లడ్లు, మునగాకు కారంపొడి తయారుచేసిన విజేతలు చక్రాల రామసబ్బులు,టి అమల, వాణి , షేక్ రజయ లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ ఆశా కార్యకర్తలు, అంగన్వాడి కార్యకర్తలు బాలింతలు, గర్భవతులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాల నరేష్ రెడ్డిని సన్మానించిన మండల అధ్యక్షులు గంగసాని మరియు మండల నాయకులు




పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): ఓం శ్రీ పరాశక్తి తల్లి ట్యూషన్ పాయింట్ మరియు కోచింగ్ సెంటర్ పామూరు,సియస్ పురం ట్రైనర్ ముత్యాల నరేష్ రెడ్డి గారికి డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ జాతీయ ప్రతిభ అవార్డు వచ్చిన సందర్భంగా ఈరోజు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపి దుశ్శాలువ, పూల దండతో ఘనంగా సన్మానించిన పామూరు మండలం వైసీపీ మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి మరియు వైసీపీ మండల నాయకులు..ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి, గట్ల విజయంభాస్కర్ రెడ్డి,షేక్ చాంద్ బాషా, అంబటి కొండారెడ్డి,జొన్నలగడ్డ గోవిందయ్య, శ్రీరామ శ్రీనివాసులు, షేక్ భార షరీఫ్,పోతుల రమేష్,-ాయబ్ రసూల్, తుపాకుల ఆంజనేయ రెడ్డి, చింతలపూడి మల్లికార్జున రెడ్డి, దండు నారాయణ రెడ్డి, మితికాల బాలకృష్ణ, కోడూరి లక్ష్మీ నారాయణ రెడ్డి, వేముల రాంబాబు, గడ్డం వెంకట నారాయణ రెడ్డి,చింతం బాలిరెడ్డి, షేక్ కాలేషా,పాలేటి ప్రేమ్ కుమార్, షేక్ నాగూర్ భాషా తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

## క్రాకర్స్ గోడౌన్స్ పరిశీలించిన డి.ఎస్.పి సాయి ఈశ్వర్ యశ్వంత్



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా ఎస్పీ శ్రీ దామోదర్ ఆదేశాల మేరకు, కనిగిరి డీఎస్పీ పి. సాయి ఈశ్వర్ యశ్వంత్ పర్యవేక్షణలో కనిగిరి సబ్ డివిజన్ పరిధిలోని ఫైర్ క్రాకర్స్ గోడౌన్స్, షాప్స్



లను ఆకస్మిక తనిఖీ లు చేపట్టిన పోలీసులు. ఈ సందర్భంగా డి.ఎస్.పి గారు మాట్లాడుతూ ఇల్లీగల్ గా లేదా పర్మిషన్స్ లేకుండా లేదా పరిమితి కి మించి ఫైర్ క్రాకెర్స్ స్టోర్ చేసుకున్నా, అమ్మినా అట్టి వారిపై చట్ట ప్రకారం చెర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే లైసెన్స్ హోల్డర్ మీద కేసు పెట్టి, షాప్ లైసెన్స్ రద్దు చేయిస్తామని వారు హెచ్చరించారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రతిభ అవార్డు అందుకున్న సూరిశెట్టి కొండలరావు



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జన్మదినం ఏప్రిల్ 14న ఆయన పేరు మీదుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రతిభ అవార్డు అందించి గౌరవించడం అనే మహత్కర కార్యాన్ని ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్( ఎస్ పి ఎల్ టి ఓ) వారి ఆధ్వర్యంలో అసెంబ్లీ హాల్, ఆంధ్ర క్రైస్తవ కళాశాల, గుంటూరు లో 13/4/25 తేదీన అవార్డుల ప్రధానోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా ప్రైవేటు విద్యారంగంలో పామూరు చెందిన ఒమిగా జూనియర్ కాలేజీ గణిత అధ్యాపకులు శ్రీ సూరిశెట్టి కొండలరావు, ఈ అవార్డుకు ఎంపిక కావడం జరిగింది. ప్రతిష్టాత్మకమైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ ప్రతిభ అవార్డులను కె.ఎస్. లక్ష్మణ్ రావు (మాజీ ఎం ఎల్ సి గుంటూరు-కృష్ణ) నిర్వహణలో ఈ అవార్డ్ కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే తమ్ముడు ముక్కు నారాయణ రెడ్డి, శ్రీమతి ముక్కు రాజేశ్వరి దంపతుల చేతుల మీదుగా మరియు ముఖ్య అతిధులు, గౌరవ, విశిష్ట అతిధుల సమక్షంలో డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ ప్రతిభా అవార్డు 2025 ప్రధానం చేయటం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహమ్మద్ నాసిర్ అహ్మద్ గారు ఎమ్మెల్యే (గుంటూరు తూర్పు నియోజకవర్గం), శ్రీమతి గళ్ళ మాధవి గారు ఎమ్మెల్యే (గుంటూరు పశ్చిమ నియోజకవర్గం), తెనాలి శ్రావణ్ కుమార్ ఎమ్మెల్యే (తాటికొండ నియోజకవర్గం) శ్రీ డొక్కా.మాణిక్య వరప్రసాద్ మాజీ ఎం ఎల్ సి , వి. కన్నా మాస్టర్ (ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ ఏ ఎ న్ యు) కాటూరి వెంకటేశ్వరరావు (స్టేట్ జాయింట్ ట్రెజర్) ఎ.గఫర్ ఎ.గౌరీ కరస్పాండెంట్ (ఎంజి కాలేజ్ ) తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



## : కేసుల పరిష్కారంలో జాప్యం తగదు

## నేర సమీక్ష సమావేశంలో కనిగిరి డీఎస్పీ పి. సాయి ఈశ్వర్ యశ్వంత్



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): పామూరు సర్కిల్ ఇన్ స్పెక్టర్ వారి కార్యాలయంలోని పోలీస్ అధికారులుకు కేసుల పరిష్కారంలో జాప్యం తగదని, నేర సమీక్ష సమావేశం నిర్వహించిన కనిగిరి డీఎస్పీ పి. సాయి ఈశ్వర్ యశ్వంత్ అన్నారు. ప్రకాశం జిల్లా ఎస్పీ శ్రీ ఏఆర్ దామోదర్



ఆదేశాలమేరకు, పామూరు సర్కిల్ ఇన్ స్పెక్టర్ పోలీసు కార్యాలయంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించి పోలీస్ అధికారులతో కనిగిరి డీఎస్పీ పి. సాయి ఈశ్వర్ యశ్వంత్ కేసుల పరిష్కారంలో జాప్యం తగదని,పిల్లలు, మహిళలు, వృదులకు సంబంధించిన కేసుల త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. స్టేషన్ వారిగా కేసుల వివరాలు ,పురోగతి తెలుసుకొని వాటిని పరిష్కారంచే దిశగా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ల ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## అమరజీవి 125వ

## జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి : పందిటి హరీష్






పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్) : అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి అని ఫోర్ మెన్ కమిటీ సభ్యులు ఆర్యవైశ్య నాయకులు పందిటి హరీష్ పట్టణంలో పలు నాయకులను కలిసి పిలుపునిచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం ఉదయం 10 గంటలకు కనిగిరి పట్టణంలో ఎంబీఆర్ కళ్యాణమండపం నందు పొట్టి శ్రీరాములు 125 జయంతి వేడుకలు ఘనంగా ప్రారంభమవుతాయని ఈ వేడుకలకు రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు పామూరు పట్టణ ఆర్యవైశ్యులు జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు అమరజీవి కేవలం ఆర్యవైశ్యులకు చెందినవారు కాదని అమరజీవి అందరివాడని ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని అమరజీవికి నివాళులర్పించాలని కోరారు.

## : నిరుపేద ఎంబీబీఎస్

## విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేసిన అల్లం బాలకిషోర్ రెడ్డి



పరకాల నియోజకవర్గం:(శుభోదయం న్యూస్ ): గీసు కొండ మండలంలోనిమచ్చాపూర్ గ్రామానికీ చెందిన నిరుపేద విద్యార్థిని నమిండ్ల సుష్మా స్వరాజ్ నీట్ పరీక్షలో స్టేట్ ర్యాంక్ 7067 సాధించి నారాయణ పేట ప్రభుత్వ మెడికల్ కళాశాల లో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం జాయిన్ అయింది.కాగ తండ్రి ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు.పేదరికంలో ఉన్న సుష్మా స్వరాజ్ కుటుంబ పరిస్థితిని స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రముఖ పారిశ్రామిక వేత్త,జిల్లా కాంగ్రెస్ నాయకులు అల్లం బాల కిశోర్ రెడ్డి పంపిన 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మంగళ వారం జిల్లా కాంగ్రెస్ నాయకులు వీరగోని రాజ్ కుమార్,అల్లం మర్రెడ్డి లు అందచేశారు.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ సుష్మా స్వరాజ్ చదివే 4 సంవత్సరాల తో పాటు ట్రైనింగ్ కాలం లో పూర్తి ఖర్చులకు డబ్బులు అందిస్తామని కిశోర్ రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమములో మాజీ సర్పంచ్ లు డోలీ చిన్ని,గోనె మల్లారెడ్డి,దౌడు బాబు మంద రమేష్, మర్రి రాజలింగం,బత్తిని భాస్కర్, బోడకుంట్ల మహేందర్, కునూరు వీరభద్రం బిల్ల అనిల్, నమిండ్ల రవి,గతికే బాస్వరాజ్యం, దూలం శ్రీకాంత్, బిల్లా యుగెందర్,రాజేష్,తదితరులు పాల్గొన్నారు.

## దళిత రత్న అవార్డుతో మరింత బాధ్యత పెరిగింది

## అవార్డుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు దొమ్మాటి శివకుమార్



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్,( శుభోదయం న్యూస్), ఏప్రిల్ 15: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ఎస్సీ షెడ్యూల్ కులాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 2025 సం ", మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా,దొమ్మాటి శివకుమార్ దళిత రత్న అవార్డు అందుకున్నారు. సోమవారం నాడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా రవీంద్రభారతిలో జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించి, దళిత జాతి కోసం కృషి చేస్తున్న వారికి దళిత రత్న అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా దళితరత్న అవార్డు అందుకున్న దొమ్మాటి శివకుమార్ మాట్లాడుతూ,తనకు దళిత రత్న అవార్డు రావడంపై తనపై మరింత బాధ్యత పెరిగిందని, దళిత జాతిని చైతన్యం చేసి రాజ్యాధికారం సాధించే దిశగా కృషి చేస్తానని అన్నారు. గత 15 సంవత్సరాలుగా గురుకులాలలో నాణ్యమైన విద్య, దళితుల పరంపోగు, ఇనాం భూములకు శాశ్వత పట్టాలు, అంటరానితనం, కులవివక్షత నిర్మూలనకై, 2009 విద్య హక్కు చట్టం అమలుకై, ఎస్సీ లో ఉండే 59 కులాలకు జనాభా దమాష ప్రకారం ఎవరి వాటా వారికి రావాలని, దళిత సమస్యలపై ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు ఉద్యమం, ఎం.ఎస్.ఎఫ్ విద్యార్థి సంఘ నాయకుడి నుండి, తెలంగాణ దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గా నేటి వరకు దళిత జాతిని చైతన్యం చేయడంలో, ఎన్నో కార్యక్రమాలు ఉద్యమాలు చేశామని చెప్పారు. మరి అదే విధంగా తెలంగాణ దండోరా సంఘంలో మీసాల రామన్న నాయకత్వంలో అనేక కార్యక్రమాలు చేస్తున్న తనతో పాటు మరో 6 మందికి దళిత రత్న అవార్డులు రావడం జరిగిందని తెలిపారు. దళిత రత్న అవార్డులకు ఎంపిక చేసి, తమకు అవార్డు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్, మహనీయుల జయంతి ఉత్సవాల వర్కింగ్ చైర్మన్ ఇటుక రాజు మాదిగ, చెరుకు రామచందర్, తెలంగాణ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రామన్న, తనకు సహకరించిన దళిత సంఘాల నాయకులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## పాదయాత్రను ప్రారంభించిన మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):బీఆర్ఎస్ పార్టీ 25 వ వసంతంలో అడుగుపెడుతున్న తరుణంలో ఈనెల 27న వరంగల్ లో తలపెట్టిన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి,యువజన విభాగం ఆధ్వర్యంలో మత్స్యగిరిగుట్ట నుండి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పాదాల వరకు తలపెట్టిన పాదయాత్రను మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్,భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి,గాదిరి కిషోర్,కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి,భూడిద బిక్షమయ్య గౌడ్, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి,రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి,మండల పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల

## పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి-సీఐటీయూ డిమాండ్



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేసి కార్మికులని ఆదుకోవాలనిసిఐటి యు జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రోజున వలిగొండ దేవిశ్రీ ఫంక్షన్ హాల్ లో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ వలిగొండ మండల కమిటీ సమావేశంమండల అధ్యక్షులు కొండ నరసింహ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ మల్టీపర్పస్ కార్మికులు కాకుండా ఇతర కార్మికులకు గత తొమ్మిది నెలల నుండి వేతనాలు రాక, కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, పంచాయతీ కార్యదర్శులు కార్మికుల వేతనాలు చెక్కులు కొట్టి ట్రెజర్లు వేసిన చెక్కులు డ్రాకాక ఇబ్బంది పడుతున్నారని వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం రాక ముందుకు గ్రామపంచాయతీ కార్మికులని ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే పద్ధతిలో ఒకటవ తేదీనే బ్యాంకు ద్వారా వేతనాలు ఇస్తానమ ని చెప్పి మాట మార్చిందని పి ఆర్ సి అమలు చేస్తానని మోసంచేసింది అని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎంపీడీవో కు సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు. ఎడవెల్లి ఎల్లమయ్య, రాములు మధు, రాజు, లింగస్వామి, మూర్తి, సాయిలు, శీను, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని

## సందర్శించిన మండల మానిటరింగ్ ఆఫీసర్ చంద్రకళ



అనంతగిరి, ఏప్రిల్ 15 శుభోదయం న్యూస్: అనంతగిరి మండలం వాయిలసింగవర గ్రామంలో ఈ రోజున పి ఏ ఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల మానిటరింగ్ అధికారి చంద్రకళ సందర్శించినారుఈ సంధర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ సన్నరకం ధాన్యాన్ని ఎండబెట్టి తూరుపాలవేసి కాంటా వేయాలని సూచించారు మరియు అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా పట్టాలు కప్పుకోవాలని రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రం వద్ద మంచినీటి సౌకర్యం కల్పించాలని అన్నారు త్వరితగతిన కాంటాలు వేయాలని రైతులకు సూచించారు సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు బోనస్ కూడా పొందాలని మధ్య దళారులను ఆశ్రయించవద్దని ఆమె రైతులకు సూచించారు ఆమె వెంట ధాన్యం కొనుగోలు కేంద్రం సెంటర్ ఇన్ చార్జి మోతుకూరి రాజారావు రైతులు కొల్లు సుబ్బారావు గద్దె శివరావు బచ్చలకూర నాగేశ్వరరావు బుర్రా మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాదులో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్



రామగుండం మండలం రిపోర్టర్ – తిరుపతి, (శుభోదయం న్యూస్) : హైదరాబాద్లోని శంషాబాద్ నోవాటెల్ హెూటల్ లో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మరియు పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, ఇతర సహచర మంత్రులతో కలిసి రామగుండం శాసనసభ్యులు ఏం.ఎస్ రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ వర్గాలకు చెందిన మహిళా లబ్ధిదారులకు మొదటి విడతగా రూ.లక్ష విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## సెల్ఫీ మీటింగ్ లో పాల్గొన్న రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



రామగుండం మండలం రిపోర్టర్ – తిరుపతి, (శుభోదయం న్యూస్ ): సిఎల్పీ సమావేశంలో పాల్గొన్న రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ శంషాబాద్ నోవోటెల్‌లో జరిగిన



సీఎల్పీ సమావేశంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్ రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు.ఈ సమావేశంలో మంత్రివర్గ విస్తరణ, ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం పథకం, ఎస్సీ వర్గీకరణ వంటి అనేక కీలక అంశాలపై ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు చర్చించారు.

## డెమొక్రటిక్ జర్నలిస్టు ఫెడరేషన్

## రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కనుకుంట్ల రమేష్ నియామకం



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్): 15-04-2025 రోజున డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సామాజిక తెలంగాణ పత్రిక రిపోర్టర్ కనుకుట్ల రమేష్ ను నియమించడం జరిగింది. ఈ నియమకం రాష్ట్ర జాతీయ అధ్యక్షులు మానసాని కృష్ణ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షులు మోట పలుకుల వెంకట్ నియమక పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు కల్లేపల్లి కుమార్ చేతుల మీదుగా నియమక పత్రాలు ఇవ్వడం జరిగింది. నా ఈ నియమకానికి కృషి చేసిన జాతీయ అధ్యక్షులు మానసాని కృష్ణారెడ్డి కి మరియు రాష్ట్ర అధ్యక్షులు మోట పలుకుల వెంకట్ కి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

## మహాత్మా జ్యోతిబా పూలే, మాత సావిత్రి భాయి పూలే దంపతులు

## మానవతా మూర్తులు,వి.హనుమంత రావు (విహెచ్)



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, (శుభోదయం న్యూస్), ఏప్రిల్ 15: హైదర్ గూడా చౌరస్తా, ఓల్డ్ ఎమ్మెల్యే కేర్టర్స్ ,మహాత్మా జ్యోతిబా పూలే, మాత సావిత్రి భాయి పూలే విగ్రహాలకు నివాళులు అర్పించిన మాజీ మంత్రి, మాజీ రాజ్యసభ సభ్యులు వి,హనుమంతరావు మాట్లాడుతూమహనీయులు మహాత్మా పూలే దంపతుల వారి పోరాటం వల్లనే బలహీన వర్గాలకు విద్య అందుబాటులోకి వచ్చిందని ఆయన అన్నారు.రిటైర్డ్ ఐఏఎస్ అధికారి,బీసీ ఇంటలెక్చవల్ ఫోరమ్ చైర్మెన్ చిరంజీవులు పూలే దంపతులకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. పూలే మార్గం అనుసరణీయం అన్నారు, హైదర్ గూడ కూడలిలో పూలే



దంపతుల విగ్రహాలు నెలకొల్పడం చాలా గొప్ప విషయం అని వ్యవస్థపకులు మేకపోతుల నరేందర్ గౌడ్ కి ధన్యవాదాలు తెలిపారు.బీసీ కుల సంఘాల చైర్మన్ బాలగౌని బాల్ రాజ్ గౌడ్ మాట్లాడుతూ పూలే సేవలను కొనియాడారు.బీసీ జేఏసీ కో ఆర్డినేషన్ చైర్మన్ సుధాగాని హరి శంకర్ గౌడ్ మాట్లాడుతు నేటి తరం పూలే మార్గాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు.జాతీయ బీసీ మేధావుల ఫోరమ్ అధ్యక్షులు,ఆళ్ల రామకృష్ణ మాట్లాడుతూనవ జాతి ఉన్నత వారకు పూలే దంపతుల పూజింప బడుతారన్నారు%ౌ%రామన్ గౌడ్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు,మేకపోతుల నరేందర్ గౌడ్ మహాత్మా పూలే దంపతుల విగ్రహాల వ్యవస్థాపక చైర్మన్,అయిలి వెంకన్న గౌడ్ రాష్ట్ర కన్వీనర్ గౌడ సంఘాల సమన్వయ కమిటీ,తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ ప్రతి మండలం కేంద్రంలో మహాత్మా జ్యోతిబా పూలే, మాత సావిత్రి భాయి పూలే విగ్రహాలను నెలకొల్పుతామని పేర్కొన్నారు, మేకపోతుల వెంకట రమణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు,ఎలికట్టే విజయ్ కుమార్ గౌడజన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ,అంబల నారాయణ గౌడ్ గౌడ ఐక్యసాధన సమితి అధ్యక్షులు , దుర్గయ్య గౌడ్ బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు, నగేష్ గౌడ్ రాష్ట్ర బీసీ నాయకులు,, బడేసాబ్ ఎంబసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు,,,ఎర్ర శ్రీహరి గౌడ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు,బీసీ సంక్షేమ సంఘం, నగిరి ప్రవీణ్ కుమార్ ఓయూ జాక్, బొంగు వెంకటేష్ గౌడ్ బీసీ మేధావుల ఫోరం వైస్ చైర్మన్,శివ కుమార్ అధికార ప్రతినిధి బీసీ సంక్షేమ సంఘం,గిరగాని భిక్షపతి గౌడ్, పేదల రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు,తాళ్ళపల్లి శేఖర్ గౌడ్,రవీందర్ తదితరులు పాల్గొన్నారు,

## 60 వేల రూపాయల

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): బాన్సువాడ నియోజకవర్గంలో 75 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) లబ్దిదారులకు సుమారు 20,38,500 రూపాయల చెక్కులను అందించిన బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి. బీర్కూర్ మండల కేంద్రంలోని చామకూర నాగమణి కి 60 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందిస్తున్న బీర్కూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు శశికాంత్, మాజీ ఎంపీటీసీ సందీప్,మాజీ కో ఆప్షన్ ఆరిఫ్,నాయకులు మన్నన్, కోరిమే రఘు,శివాజీ తదితరులు పాల్గొన్నారు.

Postal Licenced No: HDP/010/2024-2026
భారత్ రిపోర్టర్ BHARATH REPORTER తెలుగు దినపత్రిక RNI.APTEL/2023/88573

## సంపాదకీయం

# రాణా గుప్పిట కీలక రహస్యాలు!

## (విశ్లేషణ)

పదిహేడేళ్ల క్రితం ముంబై మహానగరంలో 10 మంది ఉగ్రవాదులు 78 గంటలపాటు విచక్షణా రహితంగా దాడులకు తెగబడి 166 మంది ప్రాణాలు బలితీసుకున్న ఘోర ఉదంతంలో కీలక కుట్ర దారైన తహవ్వుర్ రాణా ఎట్టకేలకు మన దేశంలో అడుగుపెట్టాడు. రానున్న 18 రోజుల్లో మన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కస్టడీలో అతగాడు ఆ ఘోర ఉదంతానికి సంబంధించి ఎలాంటి సమాచారం ఇస్తాడన్నది చూడాలి. ఆ ఉగ్రవాదులు బాంబులూ, ఇతర మారణాయుధాలతో పాకిస్తాన్‌లోని కరాచీ నుంచి సముద్ర మార్గంలో ముంబై చేరుకుని ఆ నగరంలో అనేకచోట్ల తుపాకు లతో, గ్రెనేడ్లతో చెలరేగిపోయారు. ఆ దాడుల్లో సాధారణ పౌరులూ, కర్కరే వంటి పోలీస్ ఉన్నతాధికారులూ ప్రాణాలు కోల్పోయారు. తొమ్మిదిమంది ఉగ్రవాదులను భద్రతాదళాలు హత మార్చగా, ఉగ్రవాది కసబ్ పట్టుబడ్డాడు. విచారణానంతరం 2012లో అతన్ని ఉరితీశారు. రాణా వెల్లడించేఅంశాలు మన నిఘా వర్గాల దగ్గరున్న సమాచారంతో ధ్రువీకరించుకోవటానికీ, మరో ఉగ్రవాది, ప్రస్తుతం అమెరికా జైల్లో ఉన్న డేవిడ్ హెడ్లీపై మరిన్ని వివరాలు రాబట్టడానికీ తోడ్పడుతాయి. రాణా అప్పగింత అతి పెద్ద దౌత్యవిజయమని మన ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అటు అమెరికా కూడా ఉగ్రదాడుల్లో హతమైనవారికీ, ఇతర బాధితులకూ న్యాయం చేకూర్చటంలో ఇది కీలకమైన ముందడుగని ప్రకటించింది. కావచ్చు. అయితే కేంద్ర హెూంశాఖ మాజీ కార్యదర్శి జీకే పిళ్లై చెబుతున్నట్టు 'అతగాడి దగ్గర చెప్పడానికేం లేదు గనుకనే...' అప్పగించారా? రాణా పాత్ర కూడా తక్కువేం కాదు. దాడులకు పక్షం రోజుల ముందు భార్యతో కలిసి ముంబైలో చాలా ప్రాంతాలు వెళ్లి చూశాడు. అతను ఎంపిక చేసిన ప్రాంతాలను హెడ్లీ భార్యాసమేతంగా వచ్చి తనిఖీ కూడా చేశాడు. ఇంచుమించు ఆ ప్రాంతాల్లోనే ఉగ్రవాదుల దాడులు జరిగాయి. రాణా ముంబైతోపాటు ఢిల్లీ, కొచ్చి వంటి నగరాలకు కూడా పోయాడు. 1971 నాటి యుద్ధవీరులకై నిర్మించిన ముంబైలోని జల వాయు విహార్ హౌసింగ్ కాంప్లెక్స్‌లో భార్యతో కలిసి బస చేశాడు. ఆ కాంప్లెక్స్ పేల్చివేతకు అవకాశం ఉందా లేదా చూసుకుని, అసాధ్యమని నిర్ణయించుకున్నాక భారత్ నుంచి వెళ్లిపోయాడని అంటారు. పిళ్లై వాదన పూర్తిగా కొట్టిపారేయదగింది కాదు. ఎందుకంటే ఈ మొత్తం వ్యవహారంలో రాణాతో పోలిస్తే అసలు సిసలు కుట్రదారు డేవిడ్ కోల్మన్ హెడ్లీ. ప్రస్తుతం రాణా అప్పగింత కీలకమైన ముందడుగుగా చెబుతున్న అమెరికా హెడ్లీ విషయంలో ఎందుకు మౌనం వహిస్తున్నది? ఎందుకంటే అతగాడు అమెరికా మాదకద్రవ్య నియంత్రణ విభాగం (డీఈఏ) ఏజెంట్‌గా పని చేశాడు. అదే సమయంలో ఐఎస్ఐకీ, లష్కరే తొయిబా (ఎల్ఈటీ)కీ కూడా ఏజెంట్‌గా ఉన్నాడు. ఇవన్నీ అమెరికా నిఘా సంస్థలకూ తెలుసు. అంతేకాదు... ముంబై మారణకాండ పథక రచన మొదలుకొని అన్ని విషయాలపైనా అమెరికా దగ్గర ముందస్తు సమాచారం వుంది. ఆ సంగతలా వుంచి భారత్‌లో సేకరించిన సమస్త సమాచారాన్నీ, ముంబైకి సంబంధించిన జీపీఎస్ లోకేషన్‌లనూ హెడ్లీకి రాణా అందించాడు. దాని ఆధారంగానే కొలాబా తీరప్రాంతంలోని బధ్వర్ పార్క్ దగ్గర ఉగ్రవాదులు బోట్లు దిగారు. రాణా ఇచ్చిన సమాచారాన్ని హెడ్లీ పాకిస్తాన్ పోయి అక్కడ ఐఎస్ఐ తరఫున తనతో సంప్రదిస్తున్న మేజర్ ఇక్బాల్ అనే వ్యక్తికి అందజేశాడని ఇప్పటికే మన నిఘా సంస్థలకు రూఢి అయింది. ఉగ్రవాదులకు ఐఎస్ఐ ఇచ్చిన శిక్షణేమిటో హెడ్లీకి తెలుసు. వీటిపై అమెరికా భద్రతా సంస్థలకు క్షుణ్ణంగా తెలిసినా మన దేశాన్ని ముందే ఎందుకు అప్రమత్తం చేయలేదన్న సంశయాలున్నాయి. ఇది బయటపడుతుందన్న ఉద్దేశంతోనే అమెరికా ఏవో సాకులు చెబుతోందన్నది వాస్తవం. సందేహం లేదు... రాణా కన్నా హెడ్లీ అత్యంత కీలకమైనవాడు. అతను ఎల్ఈటీలో చేరడమే కాక, ముంబై దాడులకు పన్నాగం పన్నిన ఉగ్రవాదులు హాఫీజ్ సయీద్, లఖ్వీల దగ్గర శిక్షణ తీసుకున్నాడు. ముంబై దాడుల సమయంలో దగ్గరుండి చూస్తున్నట్టుగా ఉగ్రవాదులకు ఎప్పటి కప్పుడు ఫోన్‌లో లఖ్వీ ఆదేశాలివ్వటం వెనక హెడ్లీ ప్రమేయం వుంది. తమకు ఏజెంటుగా పని చేసినవాడిని అప్పగించరాదని అమెరికా భావించటం మూర?త్వం. అదే పని భారత్ చేస్తే అంగీకరించగలదా? హెడ్లీని అప్పగిస్తే తమ గూఢచార సంస్థల నిర్వాకం బయటపడుతుందని అది సంకోచిస్తున్నట్టు కనబడుతోంది. రాణా అప్పగింత ప్రక్రియ తమ హయాంలోనే మొదలైందని గర్వంగా చెబుతున్న కేంద్ర మాజీ మంత్రి చిదంబరం హెడ్లీ విషయంలో ఎందుకు విఫలమయ్యారో చెప్పాలి. వికీలీక్స్ పత్రాలు ఈ సంగతిని చాన్నాళ్ల క్రితమే వెల్లడించాయి. హెడ్లీ అప్పగింతకు పట్టుబట్టవద్దని అప్పటి మన జాతీయ భద్రతాసలహాదారు ఎంకే నారాయణన్‌ను నాటి అమెరికా రాయబారి తిమోతీ రోమెర్ కోరినట్టు అందులో ఉంది. అలా అడిగినట్టు కనబడకపోతే తమకు ఇబ్బందులొస్తాయని నారాయణన్ బదులిచ్చినట్టు కూడా ఆ పత్రాల్లో ఉంది. హెడ్లీ ఎలాంటివాడో అతని కేసులో 2009లో తీర్పునిచ్చిన అమెరికా న్యాయమూర్తే చెప్పారు. 'హెడ్లీ ఉగ్రవాది. అతని నుంచి ప్రజలను రక్షించటం నా విధి. మరణశిక్షకు అన్నివిధాలా అర్హుడు. కానీ ప్రభుత్వ వినతి మేరకు 35 ఏళ్ల శిక్షతో సరిపెడుతున్నాను' అన్నారాయన. ఎటూ పాకిస్తాన్ తన రక్షణలో సేద తీరుతున్న లఖ్వీ, సయీద్‌లను అప్పగించదు. ఆ దేశంతో మనకు నేరస్థుల అప్పగింత ఒప్పందం కూడా లేదు. కానీ అమెరికాతో ఆ మాదిరి ఒప్పందం ఉంది గనుక హెడ్లీ కోసం మన దేశం గట్టిగా పట్టుబట్టాలి. అది సాధిస్తేనే నిజమైన విజయం దక్కినట్టవుతుంది.

# మేడారం మాస్టర్ ప్లాన్ ఎక్కడా..!



: మేడారం మాస్టర్ ప్లాన్ అటెకెక్కిందా..? గద్దెల ప్రాంగణం విస్తరణ వచ్చే మహాజాతర నాటికి అసాధ్యమేనా..? వచ్చే జాతరలోనూ లక్షలాది మంది భక్తులకు అమ్మవార్ల దర్శనం కష్టతరమేనా..? అంటే పరిణామాలు చూస్తుంటే అలాగే కనిపిస్తోంది. ఆసియాలోనే అతిపెద్ద ఆదివాసీ –గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందింది మేడారం. ఆలయ అభివృద్ధికి రూ.300 కోట్లతో పనులు చేపడుతామని రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖలు మినీ మేడారం రివ్యూ సమయంలో వెల్లడించినా జాతర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు మహాజాతర నాటికి పూర్తయ్యేలా కనిపించడం లేదు. ఎందుకంటే మాస్టర్ ప్లాన్ పనులకు ఇంకా రూపకల్పనే జరగకపోవడం ఇందుకు నిదర్శనం. మాస్టర్ ప్లాన్ ప్రతిపాదిత పనుల్లో అత్యంత ముఖ్యమైన ప్రాంగణాల విస్తరణకు ఎలాంటి ముందడుగు పడకపోవడం గమనార్హం. మేడారం మాస్టర్ ప్లాన్ అమలుకు, జాతర అభివృద్ధి పనులకు 19.5 ఎకరాల భూ సేకరణ చేపట్టాలని గతంలో రాష్ట్ర ప్రభుత్వ సూత్రప్రాయ అభిప్రాయానికి వచ్చిన ఇప్పటి వరకు ఆ దిశగా ప్రయత్నాలేవీ జరగకపోవడం వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది.

మహాజాతరలో కష్టాలు తప్పవా..?!

సమ్మక్క– సారలమ్మలను దర్శించుకునేందుకు మహాజాతర సమయంలో కోటిమందికి పైగా భక్తులు వివిధ రాష్ట్రాల నుంచి తరలివస్తుంటారు. వనదేవతలు గద్దెల పై ఉన్న ఆ మూడు రోజుల్లో లక్షలాది మంది భక్తులు మేడారం చేరుకుంటారు. మేడారమంతా భక్తజన సంద్రమవుతోంది. గద్దెల ప్రాంగణం కిక్కిరిసిపోతూ ఉంటుంది. వందల కిలోమీటర్ల నుంచి గంటల కొద్దీ క్యూలైన్లలో నిల్చుని అమ్మల దర్శనం కోసం వస్తున్న భక్తులు.. సగం మంది దూరం నుంచే వెనుదిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ప్రవేశ, బయటకు వెళ్లే మార్గాలు కూడా ఇరుకుగా ఉండటం, ప్రాంగణంలోని క్యూలైన్లను విస్తరించే మార్గం లేకపోవడం వంటి కారణాలతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పరిస్థితిని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం గద్దెల ప్రాంగణాన్ని విస్తరించాలని నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయంతో భక్తులు ఎంతో సంతోషించారు. అయితే ప్రభుత్వం ఆలోచనయితే చేసింది గాని.. ఆచరణలో పనులు ముందుకు జరగకపోవడంపై భక్తుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

టీటీడీ తరహాలో

వనదేవతలను దర్శించుకునేందుకు ఇప్పుడు నిత్యం వేలాది మంది భక్తులు మేడారం చేరుకుంటున్నారు. మహాజాతరలో కోటికి పైగా, మినీ జాతర సమయంలోనే లక్షలాదిగా భక్తులు తరలివస్తున్నారు. అయితే మేడారం మొక్కులు చెల్లించుకునేందుకు ఆదివారం, సోమ, బుధవారాల్లో వేలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లిస్తున్నారు. నిత్యం రద్దీగానే కనిపిస్తున్నాయి. మహా, మినీ జాతర సమయాల్లోనే యంత్రాంగం సౌకర్యాల పై దృష్టిపెడుతున్నా.. మిగిలిన సమయాల్లో పట్టింపు కరువవుతోంది. భక్తుల అసౌకర్యాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ ద్వారా శాశ్వతమైన అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించింది. 2026 మహాజాతర నాటికి మేడారంలో సకల సౌకర్యాలతో తీర్చిదిద్దుతామని ప్రభుత్వం వెల్లడించినా ఆ దిశగా పనులు ప్రారంభమే కాకపోవడం గమనార్హం. వాస్తవానికి 2023లోనే వనదేవతల మూలధన నిధి నుంచి 2.72 కోట్లను మాస్టర్ రూపకల్పనకు ములుగు కలెక్టర్ ఖాతాలో నిధులు జమ చేశారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా జాతర అభివృద్ధికి కోసం 300 కోట్లతో పనులకు ప్రాథమిక రూపకల్పన చేసింది. అయితే ఇందులో పూర్తి స్పష్టత లేదు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ప్రధానంగా గద్దెల ప్రాంగణాలను విశాలంగా మార్చటం, టీటీడీ తరహాలో భక్తులు ప్రశాంత వాతావరణంలో గద్దెల ప్రాంగణానికి చేరుకునేలా క్యూలైన్ కాంప్లెక్సుల నిర్మాణం, కాంప్లెక్సుల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విశ్రాంతి తీసుకునే విధంగా కూర్చునేవిధంగా గద్దెల నిర్మాణం ఉండేలా చేపట్టాలని నిర్ణయించారు. మేడారంను అనుసంధానం చేస్తున్న పస్రా – మేడారం, తాడ్వాయి–మేడారం, కొండాయి, భూపాలపల్లిని కలిపే కాల్వపల్లి, గొల్లబుద్దారం, బయ్యక్కపేట రోడ్లను విస్తరణ చేపట్టడం, మేడారం జాతర ప్రాంగణానికి చేరువలో పార్కింగ్ స్థలాలను, 20 కిలోమీటర్ల నుంచి పార్కింగ్ హెూల్డింగ్ పాయింట్లను గుర్తించి నిర్మాణాలు చేపట్టడం, మేడారంలో అంతర్గత రోడ్ల అభివృద్ధి, విస్తరణ వంటి అనేక అంశాలు మాస్టర్ ప్లాన్‌లో చేర్చి అభివృద్ధి చేయాలన్న ఆలోచనలు.. ఆలోచనలుగానే ఉండిపోతున్నాయి. మరోవైపు గద్దెల ప్రాంగణంలో 500 మీటర్లు ప్రైవేటు నిర్మాణాలు చేపట్టవద్దని 2012లో గత అధికారులు తెలియజేసినా ఆలయ పరిసరాల్లో ప్రైవేటు వ్యక్తులు కొత్త నిర్మాణాలు జరిగిపోతుండటం అభివృద్ధి పనుల కొనసాగింపునపై ప్రశ్నలు లేవనెత్తేలా చేస్తున్నాయి.

# అణు విద్యుచ్ఛక్తిలో... చైనా అద్భుతం!

**ప్రపంచంలోనే తొలిసారి కేంద్రక సంలీన, విచ్ఛిత్తి అణు రియాక్టర్**

**విజయవంతమైతే నిరంతర, అపార విద్యుచ్ఛక్తి అందుబాటులోకి**

**ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ అవసరాలు నానాటికీ ఊహాతీతంగా పెరిగిపోతున్నాయి.**



కృత్రిమ మేధ, రోబోటిక్స్, సెమీ కండక్టర్లు, బయో టెక్నాలజీ వంటి రంగాల్లో ముందంజలో ఉండాలంటే అత్యధిక విద్యుత్, అది కూడా కారుచౌకగా అందుబాటులో ఉండటం అత్యంత ముఖ్యం.ఎందుకంటే ఒక అతిపెద్ద ఏఐ డేటా సెంటర్‌ను నిర్వహించాలంటే కనీసం 40 లక్షల విద్యుత్ వాహనాలను చార్జ్ చేయడానికి సమానమైన విద్యుత్ కావాలని అంచనా. ఆన్‌లైన్ డేటాను రెప్పపాటులో ప్రాసెస్ చేసే కృత్రిమ మేధ డేటా సెంటర్లకు ప్రాణమైన గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్ (జీపీయూ)లకు కూడా నిరంతరం నిరాటంకమైన విద్యుత్ సరఫరా తప్పనిసరి. ప్రపంచమే డేటామయంగా మారిన నేపథ్యంలో డేటాను కాపాడుకోవాలన్నా, ఆన్‌లైన్‌లో నిరంతరం అందుబాటులో ఉంచాలన్నా అపారమైన విద్యుచ్ఛక్తి కావాల్సిందే. అణు విద్యుత్ రంగంలో ఇప్పటికే నంబర్‌వన్‌గా ఉన్న చైనా దీన్ని ముందే పసిగట్టింది. ప్రపంచంలోనే తొలిసారిగా 'కేంద్రక సంలీన, విచ్ఛిత్తి' సూత్రాల కలబోతగా ఓ వినూత్న అణు రియాక్టర్ తయారీకి నడుం బిగించింది. ఈ ప్రయత్నం గనుక ఫలిస్తే అపారమైన విద్యుత్ నిరంతరంగా అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు.

అన్నింట్లోనూ అగ్రస్థానం కేసి...

ప్రపంచంలో ఎక్కడ ఏ కొత్త రకం వస్తువు తయారైనా వెంటనే దానికి నకలు తయారు చేస్తుందని చైనాకు పేరుంది. ఇమిటేషన్ టెక్నాలజీకి పేరెన్నికగన్న చైనా ఇప్పుడు వినూత్న ఆవిష్కరణల ఆధారిత ఆర్థిక శక్తిగా ఎదగాలని ఆశపడుతోంది. పరిశోధన, అభివృద్ధిపై భారీగా పెట్టుబడులు పెడుతోంది. గతేడాది ప్రపంచవ్యాప్తంగా వాటికి అత్యధిక నిధులు కేటాయించిన దేశాల్లో చైనాది రెండో స్థానం విశేషం.హువాయి, టెన్‌సెంట్, అలీబాబా, గ్జియోమీ, డీజేఐ కంపెనీలు, ఇన్నోవేషన్‌కు సంబంధించి బీవైడీ తదితరాలు చైనాను టెక్నాలజీలో అగ్రస్థానంలో నిలిపాయి. 5జీ టెక్నాలజీలో హువాయి, డ్రోన్ టెక్నాలజీలో బీవైడీ టాప్ కంపెనీలుగా వెలుగొందుతున్నాయి. ఐదు నిమిషాలు ఛార్జ్ చేస్తే 400 కిలోమీటర్ల వెళ్లగల బ్యాటరీ, చార్జింగ్ వ్యవస్థలను బీవైడీ అభివృద్ధి చేసింది. విద్యుత్ వాహనాల అమ్మకాలు, ఆదాయంలో అది 'టెస్లా'ను దాటేసిందని బీబీసీ ఇటీవలే పేర్కొంది. విద్యుత్ ఆధారిత రంగాల్లో అగ్రగామిగా కొనసాగాలంటే నిరంతర విద్యుత్ అవసరం. ఆ అవసరాలు తీరేలా చైనా ఇలా కేంద్రక సంలీన, విచ్ఛిత్తి రియాక్టర్ పనిలో పడింది.

ఇలా పని చేస్తుంది

జియాన్‌గ్జీ ప్రావిన్సులోని యహెూహూ సైన్స్ ద్వీపంలో ఝింగ్‌హువో పేరిట ఈ వినూత్న అణు విద్యుత్కేంద్రాన్ని కేంద్రాన్ని చైనా నిర్మిస్తోంది. చైనా భాషలో ఝింగ్‌హువో అంటే మెరుపు. కేంద్రక విచ్ఛిత్తిలో యురేనియం వంటి బరువైన అణువులోని కేంద్రకం రెండు చిన్న కేంద్రకాలుగా విడిపోతుంది. ఆ క్రమంలో అత్యధిక స్థాయిలో ఉష్ణశక్తి వెలువడుతుంది. అణుబాంబు తయారీలో ఉండేది ఈ సూత్రమే.అణు రియాక్టర్లలో నూ దీన్నే వాడతారు. అదే కేంద్రక సంలీన ప్రక్రియలో రెండు కేంద్రకాలు కలిసిపోయి ఒక్కటిగా మారతాయి. విచ్ఛిత్తితో పోలిస్తే సంలీన చర్యతోనే అత్యధిక విద్యుదుత్పత్తి సాధ్యం. ఝింగ్‌హువో రియాక్టర్‌లో తొలుత సంలీన చర్యలు జరిపి వాటి ద్వారా వచ్చే భారయుత కేంద్రకాల సాయంతో విచ్ఛిత్తి జరుపుతారు. తద్వారా మరింత ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని చైనా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఐదేళ్లలో లక్ష్యాన్ని సాధించాలని భావిస్తున్నారు.

అత్యధిక 'క్యూ వాల్యూ'

అత్యధిక అణు విద్యుదుత్పత్తి జరగాలంటే కేంద్రక సంలీన చర్యలో అత్యధిక శక్తి ఉద్గారం జరగాలి. సంలీన ప్రక్రియలో విడుదలయ్యే అత్యధిక ఉష్ణశక్తిని రియాక్టర్ విద్యుత్ రూపంలోకి మారుస్తుంది. సంలీన ప్రక్రియకు వెచ్చించాల్సిన శక్తి కంటే దాన్నుంచి ఉత్పన్నమయ్యే శక్తి ఎక్కువగా ఉండటాన్ని 'నికర శక్తి లాభం'గా పిలుస్తారు. దాన్నే 'క్యూ వాల్యూ'గా చెప్తారు. సంలీన ప్రక్రియలో అత్యధికంగా ఏకంగా 30 క్యూ వాల్యూను సాధించాలని చైనా లక్ష్యంగా పెట్టుకున్నట్టు సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ కథనం పేర్కొంది. మూడేళ్ల క్రితం అమెరికాలో కాలిఫోర్నియాలోని నేషనల్ ఇగ్నిషన్ ఫెసిలిటీ కేంద్రం 1.5 క్యూ వాల్యూను సాధించింది. ఫ్రాన్స్‌లోని ఇంటర్నేషనల్ థర్మో న్యూక్లియర్ ఎక్స్‌పరమెంటల్ రియాక్టర్ (ఐటీఈఆర్) 10 క్యూ వాల్యూను సాధించే ప్రయత్నంలో ఉంది. అమెరికా, ఫ్రాన్స్ ఇప్పటికే కేంద్రక సంలీనం ద్వారా అణువిద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు శ్రమిస్తున్నాయి. చైనా తాజా యత్నాలు ఫలిస్తే అది ఏకంగా 20 ఏళ్లు ముందుకు దూసుకెళ్లగలదని ఆంట్రప్రెన్యూర్ ఇన్‌ఫ్లుయెన్సర్ ఆర్నాడ్ బేర్‌ట్రెండ్ అభిప్రాయపడ్డారు.

# పట్టణాల్లో అధిక ఖర్చు వీటికే..

నెలవారీ సంపాదనను నిత్యావసర ఖర్చులు, విలాసాలు, ఆన్‌లైన్ షాపింగ్.. వంటి వాటికి వెచ్చిస్తుంటారు. అయితే గ్రామీణ వినియోగదారుల ఖర్చులు పట్టణ వినియోగదారులతో పోలిస్తే కాస్త భిన్నంగా ఉండవచ్చు.ఎందుకంటే అక్కడి సామాజిక, ఆర్థిక పరిస్థితులు వేరుగా ఉంటాయి. కానీ పట్టణాల్లో వినియోగదారుల ఖర్చులు ఇంచుమించు ఒకేలా ఉంటాయి. ఆర్థిక స్తోమత మెరుగ్గా ఉన్న కొందరు మరింత లగ్జరీ వస్తువులు, హెూటళ్లు, రెస్టారెంట్లకు ఖర్చు చేస్తారు. సాధారణంగా పట్టణ వినియోగదారులు ఎలాంటి వాటికి అధికంగా ఖర్చు చేస్తున్నారో నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఫుడ్ అండ్ బేవరేజెస్

నెలవారీ బడ్జెట్‌లో గణనీయమైన భాగం అంటే సుమారు 20–30% ఆహార పదార్థాలకు కేటాయిస్తున్నారు. బియ్యం, గోధుమలు, పప్పుధాన్యాలు, కూరగాయలు, పాల ఉత్పత్తులు వంటి నిత్యావసరాలు ఇందులో ఉన్నాయి. బ్రాండెడ్, ప్యాకేజ్డ్ ఆహారాలు, తినడానికి సిద్ధంగా ఉన్న భోజనం, ప్రాసెస్ చేసిన స్నాక్స్‌కు కూడా ప్రాధాన్యత పెరుగుతోంది.

హౌసింగ్, యుటిలిటీస్

అద్దె లేదా ఇంటి కోసం ఈఎంఐలకు అధికంగా చెల్లింపులు చేస్తున్నారు. గృహ ఖర్చులు బడ్జెట్‌లో 25–35% వరకు ఉంటున్నాయి. సొంతంగా ఇళ్లు ఉన్న పట్టణ వినియోగదారులు తరచుగా తమ ఇంటి సౌకర్యానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. రిన్యువేషన్, అలంకరణలు, స్మార్ట్ హెూమ్ గాడ్జెట్ల కోసం వెచ్చిస్తున్నారు.



హెల్త్ కేర్ అండ్ ఎడ్యుకేషన్

గత దశాబ్ద కాలంలో హెల్త్ కేర్, ఎడ్యుకేషన్ వంటి సేవలపై ఖర్చు గణనీయంగా పెరిగింది. ఈ విభాగాల్లో వరుసగా 8.2 శాతం, 7.5 శాతం వృద్ధిరేటు నమోదైంది. దాంతో వీటికి చేసే ఖర్చు భారీ మొత్తంలో ఉంటుంది. ఆరోగ్య బీమా తీసుకోని వారి పరిస్థితులు దారుణంగా ఉంటున్నట్లు నిపుణులు చెబుతున్నారు. కాబట్టి ప్రతిఒక్కరు తమ కనీస బాధ్యతగా తప్పకుండా ఆరోగ్యబీమా తీసుకోవాలని సూచిస్తున్నారు. విద్యార్థుల ఫీజుల విషయంలో ప్రభుత్వాలు స్పందించి విచ్చలవిడిగా యాజమాన్యాలు వాటిని పెంచకుండా కట్టడి చేయాలని కోరుతున్నారు.

రవాణాజి

ప్రజా రవాణా, వ్యక్తిగత వాహనాలు, ఇంధనం, నిర్వహణ.. వంటి ఖర్చులు బడ్జెట్లో 10–15% ఉంటున్నాయి. ఇది వినియోగదారుల వ్యయ సరళితోపాటు ఆటోమొబైల్ పరిశ్రమ వృద్ధిని సూచిస్తుంది. చాలా మంది రవాణా కోసం కార్లు, ద్విచక్ర వాహనాలను ఎంచుకుంటున్నారు.

వినోదం


సినిమాలు, కచేరీలు, థీమ్ పార్కులు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు వంటి ఎంటర్‌టైన్‌మెంట్ విభాగాల్లో ఖర్చు చేస్తున్నారు. ఇది సాధారణంగా బడ్జెట్లో 5–10% వాటాను కలిగి ఉంటుంది. కొవిడ్ సమయంలో ఆన్‌లైన్ గేమింగ్‌ల కోసం పట్టణ వినియోగదారులు అధికంగా ఖర్చు చేశారని కొన్ని సర్వేలు చెబుతున్నాయి.పొదుపు విషయంలో చాలా మందికి సాధారణంగా ఖర్చు తర్వాత మిగిలింది జాగ్రత్తగా పొదుపు చేద్దామనే ఆలోచన ఉంటుంది. కానీ ముందు పొదుపు తర్వాతే ఖర్చు అనే ధోరణి అలవరుచుకుంటే తప్పకుండా దీర్ఘకాలంలో మంచి రాబడిని సొంతం చేసుకోవచ్చు. కాబట్టి ఖర్చులు ఎలాగో ఉంటాయి. తర్కంతో ఆలోచించి తక్కువ ఖర్చు చేస్తూ పొదుపునకు పెద్దపీట వేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

## ఉత్తరంలో హీట్ - దక్షిణంలో కూల్ : ఐఎండి అలర్ట్




(లోకల్ గైడ్):అమరావతి : రానున్న కొన్ని రోజుల్లో ఉత్తర- వాయువ్య భారతంలో హీట్ వేవ్ పరిస్థితులు కనిపిస్తాయని, దక్షిణ భారతంలో మాత్రం వర్షాలు కురుస్తాయని ఐఎండి వెల్లడించింది. ఏప్రిల్ 15 నుంచి గుజరాత్ తో పాటు వాయువ్య భారతంలో హీట్ వేవ్ పరిస్థితులు కనిపిస్తాయని వెల్లడించింది. మరోవైపు, తూర్పు భారతంతోపాటు తూర్పు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్‌లో 4, 5 రోజుల పాటు ఉరుములతో కూడిన వర్షం పడుతుందని భారత వాతావరణ శాఖ తెలిపింది. దక్షిణాది రాష్ట్రాల్లోనూ వర్షాలు పడతాయని స్పష్టం చేసింది. ఢిల్లీ ఎన్‌సీఆర్ సహా వాయువ్య భారతదేశంలో ఏప్రిల్ 13 నుంచి ఏప్రిల్ 18 మధ్య గరిష్ట ఉష్ణోగ్రతలు 3-5 డిగ్రీల సెల్సియస్ క్రమంగా పెరిగే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. ఏప్రిల్ 14 న ఢిల్లీలో ప్రధానంగా రోజంతా స్పష్టమైన ఆకాశం కనిపిస్తుందని, గరిష్ట ఉష్ణోగ్రత 38 నుండి 40 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత 21 నుంచి 23 డిగ్రీల సెల్సియస్ మధ్య స్థిరపడే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. ఏప్రిల్ 15 న, ఇదే విధమైన స్పష్టమైన వాతావరణం కొనసాగుతుంది. ఉష్ణోగ్రతలు కొద్దిగా పెరుగుతాయి. గరిష్టంగా 39 నుంచి 41 డిగ్రీల సెల్సియస్, కనిష్టంగా 22 నుంచి 24 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉంటుంది అని ఐఎండి తన బులెటిన్ లో తెలిపింది. ఏప్రిల్ 16న ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉంది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 నుంచి 42 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23 నుంచి 25 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉంది. ఐఎండి నివేదిక ప్రకారం %ా%. వాయువ్య భారతదేశంలో ఏప్రిల్ 13 నుంచి 18 వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా 3-5 డిగ్రీల సెల్సియస్ పెరిగే అవకాశం ఉంది. ఏప్రిల్ 14 నుంచి 19 మధ్య మధ్య భారతదేశంలో 2-4 డిగ్రీల సెల్సియస్ క్రమంగా పెరిగే అవకాశం ఉంది. దేశంలోని మిగతా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతల్లో గణనీయమైన మార్పు ఉండకపోవచ్చని ఐఎండి తెలిపింది. ఏప్రిల్ 14, 15 తేదీల్లో పశ్చిమ రాజస్థాన్లోని పలు ప్రాంతాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని, ఏప్రిల్ 16-18 తేదీల్లో పలు ప్రాంతాల్లో, ఏప్రిల్ 19న కొన్ని ప్రాంతాల్లో వడగాల్పులు వీస్తాయని ఐఎండి వెల్లడించింది. ఏప్రిల్ 14 తేదీల్లో తెలంగాణ, ఏప్రిల్ 15-19 మధ్య పశ్చిమ మధ్యప్రదేశ్ ఏప్రిల్ 15 నుంచి 17 వరకు గుజరాత్ లలో హీట్ వేవ్ పరిస్థితులు కనిపించవచ్చు. ఏప్రిల్ 16-18 మధ్య పంజాబ్, హర్యానా, ఏప్రిల్ 16-19 మధ్య తూర్పు రాజస్థాన్ లో వడగాల్పులు వీస్తాయి. రానున్న ఐదు రోజుల్లో ఈశాన్య, దానిని ఆనుకుని ఉన్న తూర్పు భారతంలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండి అంచనా వేసింది. ఏప్రిల్ 14 నుంచి 16 వరకు అసోం, మేఘాలయ, ఏప్రిల్ 15, 16 తేదీల్లో ఒడిశాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఏప్రిల్ 15వ తేదీన పశ్చిమ బెంగాల్, ఒడిశా, కోస్తాంధ్ర, యానాం, మధ్యప్రదేశ్, ఏప్రిల్ 14, 15 తేదీల్లో ఝార?ండ్‌లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. రానున్న ఐదు రోజుల్లో తమిళనాడు, పుదుచ్చేరి, కరైకల్, ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక, కోస్తాంధ్ర, యానాం, రాయలసీమ, తెలంగాణలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. రానున్న మూడు రోజుల్లో దక్షిణ ఇంటీరియర్ కర్నాటక, కేరళ, మాహేలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది.

## కాంగ్రెస్‌పై ఆరోపణల దాడి



**(లోకల్ గైడ్):**రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ హర్యానాలో పలు అభివృద్ధి పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో ప్రధాని మోదీ కాంగ్రెస్‌పై ఆరోపణల దాడి చేశారు. వక్ఫ్ (సవరణ) చట్టంపై తమ వైఖరి వెల్లడించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ మతవాదులను సంతృప్తి పరచిందని ప్రధాని మోదీ ఆరోపించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ మతవాదులను సంతృప్తి పరచిందనడానికి వక్ఫ్ చట్టమే రుజువు అని అన్నారు. లక్షల హెక్టార్ల భూమిని వక్ఫ్ పేరుతో దక్కించుకున్నారని, వీటితో పేద ముస్లింలు ఏనాడూ ప్రయోజనం పొందలేదని మోదీ పేర్కొన్నారు. ఇక్కడ లాభపడింది భూ మాఫియానే అని అన్నారు. ఈ దోపిడీ ఇకపై కొత్త చట్టంతో ఆగిపోతుందని, సవరించిన వక్ఫ్ చట్టం ప్రకారం వక్ఫ్ బోర్డు ఏ ఆదివాసీ భూమినీ క్లెయిమ్ చేయలేదని అన్నారు. ఇదే నిజమైన సామాజిక న్యాయమని, దీంతో పేద ముస్లింలు తమ హక్కులను కాపాడుకోగలుగుతారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ దార్శనికతకు ద్రోహం చేసిందని, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఓబీసీలను రెండవ తరగతి పౌరులుగా చూస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు. డాక్టర్ అంబేద్కర్ పేదలు, వెనుకబడిన వర్గాలకు గౌరవం ఇవ్వాలని కలలు కన్నారని, కానీ కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాల వైరస్‌ను వ్యాప్తి చేసి, అంబేదర్కర్ దార్శనికతకు అడ్డుకట్ట వేసిందని ప్రధాని పేర్కొన్నారు. వారు అంబేద్కర్ జీవించి ఉన్నప్పుడు కూడా అతనిని అవమానించారని, ఎన్నికల్లో ఓడిపోయేలా చేశారని, ఆయన వారసత్వాన్ని తుడిచిపెట్టడానికి ప్రయత్నించారని ప్రధాని మోదీ తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ఉమ్మడి పౌర చట్టాన్ని అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నదని, ఉత్తరాఖండ్ లో ఇప్పుడు లౌకిక పౌర కోడ్ అమలులో ఉందని, కాంగ్రెస్ ఇప్పటికీ దానిని వ్యతిరేకిస్తున్నదని ప్రధాని ఆరోపించారు.


## చరిత్రను చెరిపేస్తున్నారు: షేక్ హసీనా ఆగ్రహం



**(లోకల్ గైడ్):**న్యూఢిల్లీ/ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా ఆ దేశ తాత్కాలిక ప్రధాని మహ్మద్ యూనస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్ ఘన చరిత్రను చెరిపేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. అవామీ లీగ్ కార్యకర్తలతో సామాజిక మాధ్యమాల సాయంతో మాట్లాడిన ఆమె మహ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం బంగ్లాదేశ్‌ను మతోన్మాద దేశంగా మార్చిందని, దేశ స్వాతంత్ర్య సమరంలో పోరాడిన తన తండ్రి బంగబంధు షేక్ ముజిబుర్ రెహమాన్ జ్ఞాపకాలను తుడిచిపెట్టే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహ్మద్ యూనస్ ను దేశ ప్రజలను ఎన్నడూ ప్రేమించని వ్యక్తిగా హసీనా అభివర్ణించారు. యూనస్‌ను వడ్డీ వ్యాపారిగా పేర్కొంటూ, అతను అధిక వడ్డీ రేట్లకు అప్పులిచ్చి, ఆ డబ్బుతో విదేశాల్లో విలాసవంతమైన జీవితం గడిపాడని ఆరోపించారు. యూనస్ నేతృత్వంలోని ప్రభుత్వం అవామీ లీగ్ కార్యకర్తలపై దాడులు చేస్తోందని, హత్యలకు పాల్పడుతోందని, మీడియా స్వేచ్ఛను అణచివేస్తోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. షేక్ హసనా చేసిన విమర్శలు యూనస్ ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచాయి. 2024, ఆగస్టులో జరిగిన విద్యార్థుల ఉద్యమం అనంతరం షేక్ హసీనా అధికారం నుంచి దిగిపోయారు. ఆ తరువాత ఆమె భారతదేశంలో ఆశ్రయం పొందారు. అప్పటి నుంచి బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వానికి యూనస్ నాయకత్వం వహిస్తున్నారు. నాటి నుంచి హసీనా..మహ్మద్ యూనస్‌పై పలు ఆరోపణలు చేస్తున్నారు. తాజాగా ఆమె తమ పార్టీ అవామీ లీగ్ ను నిషేధించే ప్రయత్నాలను ప్రశ్నిస్తూ, ఇందుకు యూనస్ ప్రభుత్వానికి రాజ్యాంగ ఆధారం లేదని పేర్కొన్నారు. బంగ్లాదేశ్ ప్రజలు ప్రస్తుత పరిస్థితులను గుర్తించి, యూనస్‌ను అధికారం నుంచి తొలగిస్తారని, తాను తిరిగి అధికారంలోకి వస్తానని హసీనా ఆశాభావం వ్యక్తం చేశారు.

# అణు విద్యుచ్ఛక్తిలో... చైనా అద్భుతం!

### ప్రపంచంలోనే తొలిసారి కేంద్రక సంలీన, విచ్ఛిత్తి అణు రియాక్టర్ విజయవంతమైతే నిరంతర, అపార విద్యుచ్ఛక్తి అందుబాటులోకి



(లోకల్ గైడ్):ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ అవసరాలు నానాటికీ ఊహాతీతంగా పెరిగిపోతున్నాయి. కృత్రిమ మేధ, రోబోటిక్స్, సెమీ కండక్టర్లు, బయో టెక్నాలజీ వంటి రంగాల్లో ముందంజలో ఉండాలంటే అత్యధిక విద్యుత్, అది కూడా కారుచౌకగా అందుబాటులో ఉండటం అత్యంత ముఖ్యం. ఎందుకంటే ఒక అతిపెద్ద ఏఐ డేటా సెంటర్‌ను నిర్వహించాలంటే కనీసం 40 లక్షల విద్యుత్ వాహనాలను చార్జ్ చేయడానికి సమానమైన విద్యుత్ కావాలని అంచనా. ఆన్‌లైన్ డేటాను రెప్పపాటులో ప్రాసెస్ చేసే కృత్రిమ మేధ డేటా సెంటర్లకు ప్రాణమైన గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్ (జీపీయూ)లకు కూడా నిరంతరం నిరాటంకమైన విద్యుత్ సరఫరా తప్పనిసరి. ప్రపంచమే డేటామయంగా మారిన నేపథ్యంలో డేటాను కాపాడుకోవాలన్నా, ఆన్‌లైన్‌లో నిరంతరం అందుబాటులో ఉంచాలన్నా అపారమైన విద్యుచ్ఛక్తి కావాల్సిందే. అణు విద్యుత్ రంగంలో ఇప్పటికే నంబర్‌వన్‌గా ఉన్న చైనా దీన్ని ముందే పసిగట్టింది. ప్రపంచంలోనే తొలిసారిగా 'కేంద్రక సంలీన, విచ్ఛిత్తి' సూత్రాల కలబోతగా ఓ వినూత్న అణు రియాక్టర్ తయారీకి నడుం బిగించింది. ఈ ప్రయత్నం గనుక ఫలిస్తే అపారమైన విద్యుత్ నిరంతరంగా అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు.

### అన్నింట్లోనూ అగ్రస్థానం కేసి...

ప్రపంచంలో ఎక్కడ ఏ కొత్త రకం వస్తువు తయారైనా వెంటనే దానికి నకలు తయారు చేస్తుందని చైనాకు పేరుంది. ఇమిటేషన్ టెక్నాలజీకి పేరెన్నికగన్న చైనా ఇప్పుడు వినూత్న ఆవిష్కరణల ఆధారిత ఆర్థిక శక్తిగా ఎదగాలని ఆశపడుతోంది. పరిశోధన, అభివృద్ధిపై భారీగా పెట్టుబడులు పెడుతోంది. గతేడాది ప్రపంచవ్యాప్తంగా వాటికి అత్యధిక నిధులు కేటాయించిన దేశాల్లో చైనాది రెండో స్థానం విశేషం. హువాయీ, టెన్‌సెంట్, అలీబాబా, గ్జియోమీ, డీజేఐ కంపెనీలు, ఇన్నోవేషన్‌కు సంబంధించి బీవైడీ తదితరాలు చైనాను టెక్నాలజీలో అగ్రస్థానంలో నిలిపాయి. 5జీ టెక్నాలజీలో హువాయీ, డ్రోన్ టెక్నాలజీలో బీవైడీ టాప్ కంపెనీలుగా వెలుగొందుతున్నాయి. ఐదు నిమిషాలు ఛార్జ్ చేస్తే 400 కిలోమీటర్ల వెళ్లగల బ్యాటరీ, చార్జింగ్ వ్యవస్థలను బీవైడీ అభివృద్ధి చేసింది. విద్యుత్ వాహనాల అమ్మకాలు, ఆదాయంలో అది 'టెస్లా'ను దాటేసిందని బీబీసీ ఇటీవలే పేర్కొంది. విద్యుత్ ఆధారిత రంగాల్లో అగ్రగామిగా కొనసాగాలంటే నిరంతర విద్యుత్ అవసరం. ఆ అవసరాలు తీరేలా చైనా ఇలా కేంద్రక సంలీన, విచ్ఛిత్తి రియాక్టర్ పనిలో పడింది.

### ఇలా పని చేస్తుంది

జియాన్‌గ్జీ ప్రావిన్సులోని యహౌహూ సైన్స్ ద్వీపంలో ఝింగ్‌హువో పేరిట ఈ వినూత్న అణు విద్యుత్కేంద్రాన్ని కేంద్రాన్ని చైనా నిర్మిస్తోంది. చైనా భాషలో ఝింగ్‌హువో అంటే మెరుపు. కేంద్రక విచ్ఛిత్తిలో యురేనియం వంటి బరువైన అణువులోని కేంద్రకం రెండు చిన్న కేంద్రకాలుగా విడిపోతుంది. ఆ క్రమంలో అత్యధిక స్థాయిలో ఉష్ణశక్తి వెలువడుతుంది. అణుబాంబు తయారీలో ఉండేది ఈ సూత్రమే. అణు రియాక్టర్లలో నూ దీన్నే వాడతారు. అదే కేంద్రక సంలీన ప్రక్రియలో రెండు కేంద్రకాలు కలిసిపోయి ఒక్కటిగా మారతాయి. విచ్ఛిత్తితో పోలిస్తే సంలీన చర్యతోనే అత్యధిక విద్యుదుత్పత్తి సాధ్యం. ఝింగ్‌హువో రియాక్టర్‌లో తొలుత సంలీన చర్యలు జరిపి వాటి ద్వారా వచ్చే భారయుత కేంద్రకాల సాయంతో విచ్ఛిత్తి జరుపుతారు. తద్వారా మరింత ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని చైనా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఐదేళ్లలో లక్ష్యాన్ని సాధించాలని భావిస్తున్నారు.

### అత్యధిక 'క్యూ వాల్యూ'

అత్యధిక అణు విద్యుదుత్పత్తి జరగాలంటే కేంద్రక సంలీన చర్యలో అత్యధిక శక్తి ఉద్గారం జరగాలి. సంలీన ప్రక్రియలో విడుదలయ్యే అత్యధిక ఉష్ణశక్తిని రియాక్టర్ విద్యుత్ రూపంలోకి మారుస్తుంది. సంలీన ప్రక్రియకు వెచ్చించాల్సిన శక్తి కంటే దాన్నుంచి ఉత్పన్నమయ్యే శక్తి ఎక్కువగా ఉండటాన్ని 'నికర శక్తి లాభం'గా పిలుస్తారు. దాన్నే 'క్యూ వాల్యూ'గా చెప్తారు. సంలీన ప్రక్రియలో అత్యధికంగా ఏకంగా 30 క్యూ వాల్యూను సాధించాలని చైనా లక్ష్యంగా పెట్టుకున్నట్టు సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ కథనం పేర్కొంది. మూడేళ్ల క్రితం అమెరికాలో కాలిఫోర్నియాలోని నేషనల్ ఇగ్నిషన్ ఫెసిలిటీ కేంద్రం 1.5 క్యూ వాల్యూను సాధించింది. ఫ్రాన్స్‌లోని ఇంటర్నేషనల్ థర్మో న్యూక్లియర్ ఎక్స్‌పరమెంటల్ రియాక్టర్ (ఐటీఈఆర్) 10 క్యూ వాల్యూను సాధించే ప్రయత్నంలో ఉంది. అమెరికా, ఫ్రాన్స్ ఇప్పటికే కేంద్రక సంలీనం ద్వారా అణువిద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు శ్రమిస్తున్నాయి. చైనా తాజా యత్నాలు ఫలిస్తే అది ఏకంగా 20 ఏళ్లు ముందుకు దూసుకెళ్లగలదని ఆంట్రప్రెన్యూర్ ఇన్‌ఫ్లుయెన్సర్ ఆర్నాడ్ బేర్‌ట్రెండ్ అభిప్రాయపడ్డారు.

# మనసు మాట మెటాకు తెలుసు!


### ఫేస్‌బుక్, ఇన్‌స్టాలో 'ప్రకటన'ల విప్లవం తెస్తున్న మెటా

### ఆండ్రోమెడా అనే ఏఐ టెక్నాలజీతో మీ మనసు చదివే ప్రయత్నం

### మీ అభిరుచిని ముందే ఎరిగి యాడ్స్ ప్రమోట్

### దీని వల్ల పర్సనల్ యాడ్స్‌తో 14% లాభాల పెరుగుదల

### రిటైల్ స్టోర్స్‌లోనూ 12% పెరిగిన అమ్మకాలు




**(లోకల్ గైడ్):**మీ గురించి ఎవరికి బాగా తెలుసు అని ఎవరైనా అడిగితే ఏం చెబుతారు? అమ్మకో, నాన్నకో, జీవిత భాగస్వామికో, ఆప్త మిత్రుడికో అని చెబితే.. అది కచ్చితంగా అబద్ధమే. ఎందుకంటే.. ఇప్పుడు మీ గురించి అందరికన్నా మీరు వాడే ఫోన్‌కు లేదంటే ల్యాప్‌టాప్‌కే బాగా తెలుసు. మీరు కాదన్నా అదే నిజం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా మీకు ఇష్టమైన రంగు.. ఇష్టమైన చిరుతిళ్లు... ఇష్టమైన బట్టలు.. ఇలా అన్నింటిని గురించి ముందే తెలుసుకుంటున్నాయి సోషల్‌మీడియా సంస్థలు. ఇది గతంలోనూ ఉన్నప్పటికీ ఏఐ వచ్చాక వాణిజ్య ప్రకటనల స్వరూపమే మారిపోతోంది. ఈ రంగంలో ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా తీసుకొచ్చిన 'ఆండ్రోమెడా'ఇప్పుడు సరికొత్త సంచలనం.

### అంతా మార్చేసిన ఏఐ

ఫేస్‌బుక్ ఓపెన్ చేస్తే మీకు కావాల్సిన ప్రొడక్టులే ముందుగా కనిపిస్తున్నాయా? ఇన్‌స్టాగామ్‌లో స్క్రోల్ చేస్తుంటే.. మీకు నచ్చే డ్రెస్ యాడ్ టెంప్ట్ చేస్తుందా? ఇదేమీ యాదృచ్ఛికం కాదు. మీకు ఎలాంటి ప్రకటనలు చూపించాలో ముందే మెటా సంస్థ నిర్ణయిస్తోంది. మన 'సోషల్'లైఫ్‌లో యాడ్స్ తీరును పూర్తిగా మార్చేస్తోంది. మనల్ని ఏఐ పూర్తిగా చదివేస్తోంది. దీంతో మనకు నచ్చే ఉత్పత్తులే మన ముందు ప్రత్యక్షమవుతున్నాయి. మెటా అభివృద్ధి చేసిన ఆండ్రోమెడా అనే కొత్త ఏఐ టెక్నాలజీనే ఇందుకు కారణం. ఈ సిస్టమ్ రోజుకు కోట్ల యాడ్స్‌ను విశ్లేషిస్తుంది. యూజర్‌కు ఏ ప్రకటన చూపించాలో నిర్ణయిస్తుంది. నిజానికి ఇది కొత్తదేమీ కాదు. గతంలోనూ మనం ఫోన్ ద్వారా నెట్‌లో ఏదైనా వెదికితే.. దానికి సంబంధించిన అంశాలు మన సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌పై వరుసగా వచ్చేవి. ఇప్పుడు ఆ విధానం మరింత కొత్తరూపు సంతరించుకుంది.

### ఇన్‌ఫ్లుయెన్సర్లతో కలిసి యాడ్స్

కంపెనీలు తమ ఉత్పత్తుల్ని ఇన్‌ఫ్లుయెన్సర్లతో ప్రమోట్ చేయడం చూస్తున్నాం. వీడియో మొత్తం చూశాక.. వీడియోల డిస్‌క్రిప్షన్‌లోని లింకులను ఓపెన్‌చేసి నచ్చితే ఆర్డర్ పెట్టేస్తున్నాం. ఇకపై అంత కష్టపడక్కర్లేదు. యూట్యూబర్, ఇన్‌స్టాగ్రామ్ స్టార్ ఓ ప్రొడక్ట్ గురించి చెప్తే.. వెంటనే దానికి సంబంధించిన యాడ్ మీకు కనిపిస్తుంది. పాపులర్ క్రియేటర్లతో కలసి బ్రాండ్లు తమ ఉత్పత్తులను కొత్తగా ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు ఇదో చక్కని అవకాశమని కంపెనీలు చెబుతున్నాయి. ఇన్‌ఫ్లుయెన్సర్ వీడియోను చూస్తూనే.. కింద కనిపించే సంబంధిత పాపప్‌ను సెలక్ట్ చేసుకుని ఆర్డర్ పెట్టేయొచ్చన్నమాట. ఒకే ప్రకటనలో యూజర్‌కు నచ్చే మరొక ఉత్పత్తిని కూడా చూపించే అవకాశం ఇవ్వనుంది మెటా. అంటే.. ఒక కంపెనీ సమ్మర్ స్పెషల్ కలెక్షన్స్‌ను చూపిస్తూనే.. వచ్చే వర్షాకాలం సీజన్‌కు సరిపడే జాకెట్లను కూడా ప్రమోట్ చేస్తుంది. ఇలా యాడ్స్ ప్రదర్శించినప్పుడు విక్రయాల్లో 14 శాతం పెరుగుదల కనిపించిందని మెటా చెబుతోంది.

### మీరే మోడల్

ఆన్‌లైన్‌లో డ్రెస్సులు కొనడం మామూలే. కానీ, మీరే మోడల్‌గా మారి ఆయా డ్రస్సులను ధరించి చూస్కుకుని కొనుగోలు చేయటం ఇప్పుడు కొత్త ట్రెండ్. ఏఐ ఆధారంగా వర్చువల్ మోడల్స్‌ను చూపించే ఫీచర్‌ను మెటా పరీక్షిస్తోంది. యూజర్ శరీరాకృతికి తగిన డ్రెస్సులను ఎలా ధరించాలో చూపించే ప్రయత్నమిది. ఈ విధానం ఇప్పటికే ఆస్ట్రేలియా, తైవాన్‌లో ప్రయోగాత్మకంగా పరిశీలనలో ఉంది. అంతా బాగానే ఉందిగానీ.. నాకు ఆఫ్‌లైన్‌లో షాపింగ్ చేయడం ఇష్టం అంటారా? అలాంటి వారి కోసం చుట్టు పక్కల మాల్స్‌లోని షాపింగ్ అనుభువాన్ని దగ్గర చేసే ప్రయత్నం చేస్తోంది మెటా. అందుకు తగిన యాడ్స్‌ను వినియోగదారులకు పరిచయం చేస్తోంది. అవే 'ఓమ్నీ చానల్'యాడ్స్. మీరు ఆన్‌లైన్‌లో చూసిన వస్తువు.. మీ సమీపంలోని షాపుల్లో ఉందా? ఎంత ధర? ఎక్కడ కొనాలి? ఇలా అన్నీ చూపించే విధంగా ప్రాంతీయ యాడ్స్ వస్తున్నాయి. దుకాణాల లొకేషన్, డిస్కౌంట్ కోడ్స్ వంటి వివరాలను ఆ యాడ్స్‌లో కనిపిస్తాయి. ఈ యాడ్స్ వాడిన బ్రాండ్లకు 12 శాతం విక్రయాలు పెరిగినట్లు మెటా తెలిపింది.

### నోటిఫికేషన్‌లోనూ యాడ్స్

ఇదో సరికొత్త ప్రయోగం. ఫేస్‌బుక్, ఇన్‌స్టాను ఓపెన్ చేయగానే నోటిఫికేషన్స్ కనిపిస్తాయి. వాటిలో ఇప్పటివరకు ఏ ఫ్రెండ్ రిక్వెస్ట్ లేదంటే కామెంట్స్, లైక్‌లు కనిపిస్తున్నాయి. ఇకపై ఆ నోటిఫికేషన్స్‌లో యాడ్స్ కూడా ఉండొచ్చు. ఆ యాడ్స్ గతంలో మీరు వెతికిన ఉత్పత్తులవే అయి ఉంటాయి. మీరు మళ్లీమళ్లీ వెతికే పని లేకుండా మీ నోటిఫికేషన్‌కు తీసుకొచ్చేస్తోంది మెటా. కొన్ని డిస్కౌంట్ యాడ్స్‌ను కొత్తగా మార్చేస్తోంది. 'డిస్కౌంట్ పొందాలంటే మీ ఈమెయిల్ ఇవ్వండి'అని నేరుగా అడుగుతుంది. మీరు మెయిల్ అడ్రస్ ఇచ్చి డిస్కౌంట్ ఆఫర్ పొందొచ్చు. దీంతో బ్రాండ్లు తమ కస్టమర్ల లిస్టును పెంచుకోగలుగుతాయి. ఈ మార్పుల ద్వారా మెటా వాణిజ్య ప్రకటనలకు సరికొత్త నిర్వచనం ఇస్తోంది. యాడ్స్‌ను చూడడం టైమ్‌పాస్ కాదు.. టైమ్‌ను సేవ్ చేయడం అని చెబుతోంది.

# కళను దొంగలిస్తున్న ఏఐ




**(లోకల్ గైడ్):**సాంకేతికత పెరుగుతున్న కొద్దీ కొత్త ఆవిష్కరణలు పుట్టుకొస్తున్నాయి. మొన్నటికిమొన్న ఓపెన్‌ఏఐ తీసుకొచ్చిన ఏఐ జనరేటివ్ ఆర్ట్ జీబ్లీ టూల్ ఎంత పాపులర్ అయిందో అందరికీ తెలిసిందే. ఒక సంస్థ ప్రజల్లో ఆదరణ పొందే సర్వీసును అందుబాటులోకి తీసుకొస్తే పోటీ కంపెనీలు కూడా తమ యూజర్లను కాపాడుకునేందుకు ఎలాగైనా అదే తరహా, అంతకంటే మెరుగైన సేవలు అందించేందుకు పావులు కదుపుతాయి. అందులో భాగంగానే గూగుల్, గ్రోక్‌ఏఐ వంటి సంస్థలు కూడా ఏఐ ఆర్ట్ జనరేషన్ ఇమేజ్‌ను అందిస్తున్నాయి. కానీ ఇది నిజమైన కళాకారుల కళలను అనుసరిస్తూ, కాపీ రైట్ ఆందోళలనలకు దారితీస్తుందని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### కాపీరైట్ ఆందోళనలు

ఏఐ నమూనాలు శిక్షణ కోసం చాలాసార్లు కాపీరైట్ చేసిన కంటెంట్ డేటాసెట్లపై ఆధారపడతాయి. స్పష్టమైన అనుమతి లేకుండా ఇటువంటి కంటెంట్‌ను ఉపయోగించడం కాపీరైట్ ఉల్లంఘన కిందకు వస్తుందని కొందరు ఆందోళన చెందుతున్నారు. దాంతో కృత్రిమ మేధ సృష్టించిన ఆర్ట్ కంటెంట్ ఓనర్‌షిప్ ఎవరనే దానిపై సందిగ్దత నెలకొంటుంది. ఏఐ ఆర్ట్ జనరేటర్లు నిర్దిష్ట కళాత్మక శైలులను అనుకరిస్తాయి. ఇది మానవ కళాకారుల ఒరిజినాలిటీని బలహీనపరుస్తుంది. ఏఐ ఆర్ట్ కంటెంట్ మానవ కళాకారుల పనిని తగ్గిస్తుంది. ఇది వారిని ఆర్థిక ఊబిలోకి నెట్టివేస్తుందనే అభిప్రాయాలున్నాయి.

### దుర్వినియోగం

ఏఐ జనరేటెడ్ ఆర్ట్ ఒక కళాకారుడి శైలిని ప్రతిబింబించగలదేమో కానీ తన విలువలను, ఉద్దేశాలను తెలుపలేదు. ఉదాహరణకు, హయావో మియాజాకి(శాంతికి సంబంధించిన కళాకండాలు వేసే చిత్రకారుడు) వంటి కళాకారుడి శైలికి విరుద్ధంగా సైనిక, హింసాత్మక చిత్రాలను ఏఐ సృష్టిస్తోంది.

### భావోద్వేగాలు

కృత్రిమ మేధ చారిత్రక విషాదాలు లేదా సాంస్కృతిక సంఘటనలు వంటి సున్నితమైన అంశాలను చిత్రాల రూపంలో స్టైలిష్‌గా చూపుతుంది. కొన్నిసార్లు విచిత్రమైన రీతిలో వాటిని ప్రదర్శిస్తుంది. ఇది ఆయా సంఘటనల వల్ల ప్రభావితమైన వారికి ఎంతో భావోద్వేగాన్ని కలిగిస్తుంది. ప్రముఖ కంపెనీల ఏఐ ఆర్ట్ జనరేటివ్ ఇమేజింగ్ వ్యవస్థలు సృష్టిస్తున్న కంటెంట్‌కు పరిమితులుండాలని కొందరు అంటున్నారు. ఎదుటివారి మనోభావాలు, ఆర్థిక, సామాజిక స్థితి దిగజారకుండా ఉండేంతవరకు పరిమితులకు లోబడి ఏఐ కంటెంట్ ఉండే సరిపోతుందని తెలుపుతున్నారు. అందుకు సమగ్ర విధానాలు రూపొందించడానికి ప్రత్యేక వ్యవస్థను సిద్ధం చేయాలని సూచిస్తున్నారు.

## కంచ గచ్చిబౌలి భూములపై ప్రధాని మోదీ రియాక్షన్ ఇదే



న్యూఢిల్లీ: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సమీపంలో కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూముల గురించి గత కొన్ని రోజులుగా వివాదం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ భూములను అన్యాక్రాంతం చేయవద్దని విద్యార్థులతో పాటు విపక్షలు, విద్యార్థి సంఘాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం మాత్రం ఆ భూములు తమవే అని చెబుతోంది. అయితే ఈ విషయంపై ప్రధాని నరేంద్ర మోడీ స్పందించారు. బిజెపి ప్రభుత్వం చెత్త నుంచి కూడా పనులు చేయాలని చూస్తుంటే.. కాంగ్రెస్ సర్కారు మాత్రం అడవులను నాశనం చేస్తోందని ఆయన అన్నారు. ప్రకృతిని ధ్వంసం చేసి వన్యప్రాణులను చంపుతున్నారని.. అడవులపై బుల్డోజర్లు నడపడంలో తెలంగాణ సర్కారు బిజీగా ఉందని ఆయన విమర్శించారు. తమ ప్రభుత్వం అడవులను కాపాడుతుంటే.. కాంగ్రెస్ సర్కారు అడవులను నాశనం చేస్తోందని మండిపడ్డారు. తెలంగాణతో పాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సర్కారులపై కూడా ప్రధాని తనదైన శైలీలో విమర్శలు చేశారు. కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో ప్రజలకు నమ్మక ద్రోహం జరుగుతోందని ఆయన అన్నారు. హిమాచల్‌లో అభివృద్ధికి కుంటుపడిందని.. కర్ణాటక ప్రభుత్వం అవినీతిలో నెంబర్.1లో ఉందని ఎద్దేవా చేశారు. రాజ్యాంగాన్ని కాపాడుకుంటూ.. బిజెపి ముందుకు వెళ్తోందని ఆయన పేర్కొన్నారు.

## హిందువుల మనోభావాలతో ముడిపడిన అంశంపై చాలా జాగ్రత్త: ఈవో శ్యామలరావు




అమరావతి: గత ప్రభుత్వంలో గోశాలలో నాచు పట్టేసిన నీళ్లను గోవులకు పట్టించారని టిటిడి ఈవో శ్యామలరావు ఆరోపణలు చేశారు. గోవులు తాగే నీళ్లు నాచు పట్టేసినా పట్టించుకోలేదని అన్నారు. తిరుపతి ఎస్వీ గోశాలలో ఆవుల మృతిపై టిటిడి ఈవో మీడియా సమావేశం జరిపారు. పురుగులు పట్టేసి.. వినియోగించుకోలేని నీళ్లు గోవులకు పట్టిస్తారా?అని ప్రశ్నించారు. విజిలెన్స్ వాళ్లు వెళ్లేందుకు కూడా గతంలో అనుమతించని పరిస్థితి నెలకొందని చెప్పారు. హిందువుల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశంపై చాలా జాగ్రత్తగా ఉండాలి కదా!అని అన్నారు. గోశాల ఆవరణలో చెల్లా చెదురుగా మెడిసిన్స్ పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 2024లో ఈవోగా బాధ్యతలు తీసుకునే ముందు సిఎం చంద్రబాబును కలిశానని తెలియజేశారు. టిటిడిలో వ్యవస్థలు పాడయ్యాయని..వాటిని సరిచేయాలని సిఎం చెప్పారని తెలిపారు. పదినెలల్లో ఎన్నో ప్రక్షాళన కార్యక్రమాలు చేపట్టామని, భక్తుల మనోభావాలకు అనుగుణంగా మౌలిక వసతులు మెరుగుపరిచామని వెల్లడించారు. టిటిడి ఐటీ విభాగంలో ఉన్నత స్థాయి అధికారి నియామకంలో నిబంధన గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. జిఎం స్థాయి అధికారి నియామకాల్లో అక్రమాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. ఐటి విభాగం వైఫల్యంతో భారీగా అక్రమాలు జరిగాయని, ఒక దళారి 50 సార్లు ఆర్జిత సేవలు టికెట్ పొందారని పేర్కొన్నారు. ఆవు నెయ్యి కొనుగోలులో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఈవో శ్యామల రావు స్పష్టం చేశారు. వైసిపి గవర్నమెంట్

## పౌరుల హక్కులకు రాజ్యాంగం రక్షణ కవచం



లక్నో : రాజ్యాంగం పౌరుల హక్కులు, రిజర్వేషన్లకు కవచంలా పనిచేస్తోందని సమాజ్ వాది పార్టీ (ఎస్‌పి) అధ్యక్షులు అఖిలేష్ యాదవ్ పేర్కొన్నారు. అంబేద్కర్ మార్గాన్ని అనుసరించే వారికి ఇది జీవనాడి అని అన్నారు. దేశం రాజ్యాంగం ద్వారా పరిపాలించబడటం నేటికీ కీలకమని అన్నారు. సోమవారం భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఆయనకు అఖిలేష్ యాదవ్ నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రపంచంలోనే అత్యుత్తమమైన రాజ్యాంగాన్ని మనకు అందించినందుకు, ఈ రోజు దేశవ్యాప్తంగా ప్రజలంతా అంబేద్కర్‌ను స్మరించుకుంటున్నారని అన్నారు. ఆయన జీవన ప్రయాణం అందరికీ స్ఫూర్తినిస్తుందని అన్నారు. రాజ్యాంగ విలువలను బలోపేతం చేయడంలో దేశం ఐక్యంగా నిలవాలని కోరారు. రాజ్యాంగం బలహీనపడితే.. ప్రజాస్వామ్యం కూడా బలహీనమౌతుందని హెచ్చరించారు.

# లాంగ్‌లిస్టులూ... షార్ట్‌లిస్టులూ....



ఆంధ్రప్రదేశ్‌లో వందల ఉగాది పురస్కారాల హడావిడిలో రచయితలు ఉండగా, తెలంగాణలో కంచ గచ్చిబౌలి స్థలాలకు సంబంధించి తమ పర్యావరణ స్పృహను సోషల్ మీడియా పోస్టులతో వెల్లడించే పనిలో సాహితీకారులు ఉండగా దేశాన కొన్ని ఆసక్తికరమైన సాహితీ ఘటనలు చోటు చేసుకున్నాయి. తన మానాన తానుంటూ తన రాతేదో తాను రాసుకుంటూ వచ్చిన హిందీ కవి వినోద్ కుమార్ శుక్లాకు జ్ఞానపీఠ పురస్కారం ప్రకటించడం వాటిలో ఒకటి. ఆయన సీదాసాదా మనిషి. రచనల శీర్షికలు కూడా బహు సరళంగా ఉంటాయి. 'పనివాడి అంగీ'... 'గోడలో ఒక కిటికీ ఉండేది'... వినోద్ కుమార్ శుక్లా మొదట రచ్చ గెలిచారు. ప్రతిష్ఠాత్మకమైన 'పెన్ నబకోవ్ అవార్డ్'ను 2023 సంవత్సరానికి గెలుచుకున్నారు. ఆ అవార్డు పొందిన ఏకైక భారతీయ కవి ఆయనే. కాబట్టి విలువైన ఆయన సాహిత్యానికి సర్వోత్కృష్ట జ్ఞానపీఠం దక్కడం అందరూ హర్షించారు. శుక్లా గారితో పోటీ పడినవారిలో ఒక తెలుగు పేరు ఉంది. జ్ఞానపీఠం షార్ట్‌లిస్టులో తెలుగు పేరు ఉండటం ఘనతే. రావూరి భరద్వాజ తర్వాత తాము జ్ఞానపీఠ పురస్కారానికి యోగ్యులమని భావిస్తున్నవారు ఉన్నారు. అయితే అలా యోగ్యులమని అనుకునేవారిలో కొందరి పేర్లు హడలిచచ్చేలా ఉన్నాయనే గిట్టనివారూ ఉన్నారు. భారతదేశంలో స్థానికంగా గాని, జాతీయస్థాయిలో గాని షార్ట్‌లిస్టులలో పేరు చేరేవారు కొందరైతే చేర్పించుకునేవారు కొందరు. 'సాహిత్య అకాడెమీ అవార్డు' షార్ట్‌లిస్టుల్లో చేర్చబడ్డాయేమో అనిపించేలా కొన్ని పేర్లు చూసి ఆకలిదప్పులు మాని మంచం పట్టే సాహిత్యాభిమానులు ఉన్నారు. ప్రతిఏటా ఈ షార్ట్‌లిస్ట్ వీరి పాలిట ప్రాణాంతకంగా మారడం ఆందోళనకరం. అయితే అంతర్జాతీయ స్థాయిలో ఇలా చేర్పించుకోవడం సాధ్యం కాదు. అందుకే కన్నడ నేలన ఇప్పుడు సంబరాలు సాగుతున్నాయి. కారణం 'ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ 2025' షార్ట్‌లిస్ట్‌లో మొదటిసారి కన్నడ పుస్తకానికి చోటు దక్కింది. సీనియర్ కన్నడ రచయిత్రి బాను ముష్టాక్ రాసిన కథాసంపుటి 'హార్ట్ ల్యాంప్' ఈ షార్ట్‌లిస్టులో ఉంది. యాక్టివిస్ట్‌గా ఉంటూ దళిత, మైనార్టీ మహిళా జీవితాలను ఎక్కువగా రాసే బాను ముష్టాక్ పుస్తకంతో పాటు కేవలం 6 పుస్తకాలతో ఉన్న షార్ట్‌లిస్ట్ నుంచి మే 20న విజేతను ప్రకటిస్తారు. 50 లక్షల రూపాయల బహుమతి ఉంటుంది. అదొక్కటే కాదు ఆ నవల ప్రపంచవ్యాప్తంగా పాఠకులకు చేరువవుతుంది. బాను ముష్టాక్ గెలిస్తే కన్నడ భాష ఘనతకు మరో నిదర్శనమవుతుంది. ఇలాగే 2022లో 'రేత్ కీ సమాధి' నవల ఇంగ్లిష్ అనువాదం 'టూంబ్ ఆఫ్ శాండ్'కు గీతాంజలిశ్రీ బుకర్‌ప్రైజ్ గెలుచుకున్నారు. అప్పుడుగాని ఇప్పుడుగాని తెలుగు నవల, కథ ఈ దారుల్లోకి రాకపోవడం మన వరకూ ఘనతే. ప్రపంచ దేశాలలో తెలుగు రాష్ట్రాలలో ఒక జిల్లా అంత ఉన్నవారు, హైదరాబాద్ జనాభా అంత సంఖ్యలో భాషను మాట్లాడేవారు, మన దేశంలో పదేళ్ల కాలంలో కేవలం యాక్సిడెంట్లలో మరణించేంతమంది మాత్రమే రాసే, చదివే భాష ఉన్నవారు కూడా అంతర్జాతీయస్థాయి అవార్డుల లాంగ్‌లిస్టులలో, షార్ట్‌లిస్టులలో కనిపిస్తారు. రెండు కోట్ల మంది జనాభా ఉన్న శ్రీలంక నుంచి ఎందరో అంతర్జాతీయ స్థాయి రచయితలు ఉన్నారు. పది కోట్ల తెలుగు జనాభా నుంచి అంతర్జాతీయ అవార్డుల సంగతి అటుంచి పెంగ్విన్ వంటి ప్రసిద్ధ పబ్లిషర్ల వరకూ చేరే రచనలు ఎన్ని... రచయితలు ఎందరు? 'ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ 2025' కోసం 12 దేశాల నుంచి 13 మంది రచయితల పుస్తకాలు లాంగ్‌లిస్ట్ అయ్యాయి. విశేషం ఏమిటంటే వీరంతా మొదటిసారి నామినేట్ అయినవారు. బోణి కొట్టి తమ ఉనికి చాటినవారు. వీరి నుంచి ఆరు మందితో షార్ట్‌లిస్ట్‌ను ప్రకటించారు. ఆ షార్ట్‌లిస్ట్‌లో కన్నడ నుంచి బాను ముష్టాక్ ఉన్నారు. షార్ట్‌లిస్ట్‌ను ప్రకటిస్తూ బుకర్ ప్రైజ్ కమిటి యు.కె.కు చెందిన ట్రాన్స్‌లేటర్ సోఫీ హ్యూస్‌ను ప్రత్యేకంగా ప్రశంసించింది. ఆమె అనువాదం చేసిన రచనలు ఇప్పటికి ఐదుసార్లు లాంగ్‌లిస్ట్‌లో మూడుసార్లు షార్ట్‌లిస్ట్‌లో వచ్చాయి. ఇది రికార్డు. ఇక్కడే తెలుగు వారి ఘనత ఉంది. తెలుగు పుస్తకాలు గతంలో కాని వర్తమానంలోగాని ఇంగ్లిష్‌లో గట్టిగా అనువాదం చేసేవారి సంఖ్య చేతి వేళ్లకు మించి లేకపోవడమే ఆ ఘనత. విదేశాలకు లక్షలమంది తెలుగువారు పైచదువులకు వెళ్లినా వారిలో సాంకేతిక విద్య, దాని వల్ల వచ్చే సంపద లక్ష్యంగా కనిపిస్తుంది గాని లింగ్విస్టిక్స్ చదవడం, ఇతర భాషలు నేర్చి తెలుగు సాహిత్యాన్ని అనువాదం చేయడం అనేదే లేదు. మిగిలిన భాషల వారు ఈ పని చేస్తున్నారు. ప్రపంచ భాషలు నేర్చి తమ సాహిత్యానికి వాహకులుగా మారుతున్నారు. సోఫీ హ్యూస్‌లాంటి వారు మనలో తయారవ్వాలి లేదా మన కోసం రావాలి. సిఫార్సులు, పైరవీలు లేకుండా... గ్రూపులూ గుంపులూ కట్టకుండా మంచి సాహిత్యం కోసం కృషిని లగ్నం చేసిన తెలుగు రచయితలు ఉన్నారు. ప్రపంచం దృష్టికి వెళ్లాల్సిన రచనలు వీరివి కొద్దిగా అయినా సరే ఉన్నాయి. స్థానిక రాజకీయాలకు ఎడంగా జరిగి దేశీయంగా, అంతర్జాతీయ స్థాయిలో మనమేంటి, మనమెక్కడ అనే ఆలోచనతో సాహితీ పరివారం మేలుకోవాల్సిన తరుణం ఇది. రచయితలు, అనువాదకులు, పబ్లిషర్లు, యూనివర్సిటీలు... దండు కట్టి దృష్టి పెట్టగలిగితే నేడు కన్నడ సీమలో జరుగుతున్న సంబరాలు తెలుగులో జరక్కపోవు. షార్ట్‌లిస్టులలో చేరాల్సిన వారి గురించి పట్టకపోతే చేర్చబడేవారే మన ప్రతినిధులుగా కాన వస్తారు. ప్రస్తుతానికి లక్ష్యం క్రోసులకొద్ది దూరం. మొదటి అడుగు పడితే గమ్యం ఎంతసేపని?

# బిల్లుల అంశంపై 'సుప్రీం' కీలక తీర్పు



తమిళనాడు శాసనసభ పంపిన పది బిల్లులను ఎలాంటి కారణం లేకుండా మూడేళ్లపాటు తమిళనాడు గవర్నర్ తన వద్దనే అట్టే పెట్టుకోవడంపై ఇటీవల సుప్రీం కోర్టు తీవ్రంగా మందలించిన సంగతి తెలిసిందే. గవర్నర్‌కు తన రాజ్యాంగ పరిధి, బాధ్యతలు ఎంతవరకో గుర్తు చేసింది. ఈసారి గవర్నర్లు రాష్ట్రపతి పరిశీలన కోసం పంపే బిల్లులపై సుప్రీం కోర్టు సంచలనాత్మక తీర్పు వెలువరించింది. ముఖ్యంగా గవర్నర్లు పంపిన బిల్లులపై రాష్ట్రపతి మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని గడువు నిర్దేశిస్తూ సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం ఇదే తొలిసారి. తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి 2020 నుంచి పెండింగ్‌లో ఉంచారు. ఈ బిల్లుల్లో యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ల నియామకం, ఖైదీల ముందస్తు విడుదల, పబ్లిక్ సర్వెంట్స్‌పై ప్రాసిక్యూషన్ వంటి కీలకమైన బిల్లులున్నాయి. వీటిని మూడేళ్లుగా తొక్కిపెట్టి 2023లో రాష్ట్రపతి పరిశీలనకు పంపడం వివాదాస్పదమైంది. ఇలా తొక్కిపెట్టడం రాజ్యాంగ విరుద్ధమని ఇటీవలనే సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఏదైనా బిల్లును మంత్రిమండలి సలహామేరకు రాష్ట్రపతి ఆమోదం కోసం పెండింగ్‌లో ఉంచాలనుకుంటే దానికి గవర్నర్ తీసుకోదగిన అత్యధిక గడువు ఒక నెల మాత్రమేనని స్పష్టం చేసింది. శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ చర్యలు తీసుకోవడానికి గడువును నిర్దేశిస్తూ సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేయడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఒకవేళ మంత్రి మండలి సలహా లేకుండా గవర్నర్ బిల్లు ఆమోదాన్ని ఆపాలనుకుంటే మూడు నెలల్లోగా అలాంటి బిల్లును శాసనసభకు తిరిగి పంపించాలని సూచించింది. తమిళనాడు గవర్నర్ రవి చట్టవిరుద్ధంగా వ్యవహరించడం వల్ల సుప్రీం కోర్టు తన అసాధారణ అధికారాలు (ఆర్టికల్ 142) ఉపయోగించి, ఈ బిల్లులను శాసనసభ మళ్లీ పంపిన తేదీ నాటికి గవర్నర్ అంగీకరించినట్టు డీమ్డ్ అసెంట్‌గా ప్రకటించింది. గవర్నర్ ఈ గడువును పాటించని పక్షంలో ఆయన చర్యపై కోర్టులు న్యాయసమీక్ష జరపవచ్చని వెల్లడించింది. మంత్రిమండలి సలహా సూచనల మేరకు తప్పనిసరిగా పనిచేయడం తప్ప గవర్నర్‌కు విచక్షణాధికారాలేవీ లేవని, రాజ్యాంగంలోని 200వ అధికరణం కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోందని తెలియజేసింది. రెండోసారి సమర్పించిన బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం రిజర్వు చేసి ఉంచే అధికారం గవర్నర్‌కు లేదంది. ఇదే విధంగా ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి పరిశీలనకోసం గవర్నర్లు పంపే బిల్లులను మూడు నెలలకు మించి ఉంచకూడదని జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ మహదేవన్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఒకవేళ జాప్యం జరిగితే దానికి కారణాలను రాష్ట్రాలకు రాష్ట్రపతి భవన్ వివరించాల్సి ఉంటుందని తెలియజేసింది. ఒకవేళ నిర్ణీత సమయంలోనూ రాష్ట్రపతి నుంచి సరైన స్పందన లేకుంటే మాండమస్ రిట్ పిటిషన్ దాఖలు చేయవచ్చని రాష్ట్రాలకు సుప్రీం కోర్టు సూచించింది. మాండమస్ రిట్ అంటే ఒక కోర్టు నుండి ప్రభుత్వ అధికారి లేదా సంస్థకు జారీ చేసే ఆజ్ఞాపన. దానిద్వారా ఆ అధికారి లేదా సంస్థ తన చట్టబద్ధమైన బాధ్యతలను నిర్వర్తించాలని కోర్టు ద్వారా ఆదేశించడం. గవర్నర్లు రాష్ట్రపతి బిల్లులను అనవసరంగా ఆలస్యం చేయడం వల్ల రాష్ట్రాల శాసనసభల హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. ఎన్నికైన శాసనసభలు ప్రజల అభీష్టాన్ని ప్రతిబింబిస్తాయి. గవర్నర్ లేదా రాష్ట్రపతి అనవసర జోక్యం దీన్ని దెబ్బతీస్తుందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఆర్టికల్ 201లో నిర్దేశిత గడువు లేని లోటును సరిచేస్తూ సర్కారియా కమిషన్ (1983), పుంఛి కమిషన్ (2007) సిఫార్సులను ఆధారంగా చేసుకుని సుప్రీం కోర్టు మూడు నెలల గడువు విధించడం గమనార్హం. ఒకవేళ బిల్లు గాని రాజ్యాంగానికి విరుద్ధంగా ఉంటే ఆర్టికల్ 143 ప్రకారం సుప్రీం కోర్టును సంప్రదించడానికి రాష్ట్రపతికి అవకాశం ఉందని సూచించింది. రాష్ట్రపతి వద్ద రాష్ట్రాల బిల్లులు పెండింగ్‌లో ఉండిపోవడం, తీవ్ర జాప్యం జరగడంతో సంబంధిత రాష్ట్రాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. రాష్ట్రాలు కూడా తాము శాసనసభల్లో బిల్లులను ప్రవేశపెట్టేముందు రాజ్యాంగపరమైన ప్రయోజనాలకు సంబంధించిన ఆయా అంశాలపై రాష్ట్రపతి ఆమోదం ఎంత అవసరమో కేంద్ర ప్రభుత్వంతో చర్చించడం అవసరమని సుప్రీం కోర్టు ధర్మాసనం సిఫార్సు చేసింది. అదే విధంగా రాష్ట్రాలు పంపిన బిల్లుల విషయంలో వేగంగా రాష్ట్రపతి నుంచి ఆమోదం పొందేలా కేంద్రం కూడా పరిశీలించాలని సూచించింది. ఇలాంటి ఆచరణాత్మక సమన్వయం వల్ల కేంద్రంరాష్ట్రాల మధ్య ప్రారంభంలో ఘర్షణ తలెత్తకుండా భవిష్యత్తులో ఎలాంటి ఆటంకాలు ఎదురవ్వకుండా సానుకూల పరిస్థితి ఏర్పడుతుందని సూచించింది. ఫలితంగా ప్రజాసంక్షేమం సిద్ధిస్తుందని ధర్మాసనం అభిప్రాయపడింది. రాష్ట్రపతి వద్ద తమ బిల్లులు ఆమోదంపొందకుండా విపరీతంగా ఆలస్యమవుతున్నాయని వాదిస్తూ కేరళ తదితర రాష్ట్రాలు సుప్రీం కోర్టును ఆశ్రయించడం పరిపాటిగా వస్తోంది. తాము పంపిన నాలుగు బిల్లులు రాష్ట్రపతి వద్దనే ఉండిపోయాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్‌కు వ్యతిరేకంగా కేరళ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో ఇటీవల రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు సంచలనాత్మక తీర్పు గవర్నర్లు, రాష్ట్రపతి బిల్లులపై తీసుకునే నిర్ణయాల్లో ఎక్కువ పారదర్శకత, జవాబుదారీతనం తెస్తుందన్న దృఢవిశ్వాసం కలుగుతోంది. ఈ తీర్పుతో తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగ చరిత్రలో తొలిసారి రాష్ట్రపతి, గవర్నర్ ఆమోదం లేకుండానే 10 చట్టాలను ప్రభుత్వం నోటిఫై చేసింది. ఈమేరకు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది.

# అందరి చూపు.. భారత్ వైపు



ట్రంప్ మొదటి పదవీకాలంలో ఉన్నంత సన్నిహితంగా నరేంద్ర మోడీ ట్రంప్‌తో వ్యవహరిస్తారా అన్నది చూడాలి. ఎందుకంటే ట్రంప్ దాదాపు డైరెక్టుగానే భారత దేశంతో అంత సన్నిహిత స్నేహసంబంధాలు లేవని పదేపదే అంటూ, మోడీకి ఖేదం కలిగిస్తున్నారు. ట్రంప్ భారతదేశం గురించి చెడుగా, కాస్త తక్కువచేసి మా ట్లాడడాన్ని భారతదేశంలోని ఉన్నత వర్గాలు, మీడియా, రాజకీయ వర్గాలు కూడా పెద్దగా పట్టించుకోలేదు. దీనిపై వివరణ ఇచ్చేందుకు సిద్ధపడినవారూ ఉన్నారు. మోడీ వంటి ఆత్మాభిమానం గల, స్వీయంగా ఇమేజ్ గల నాయకుడు తనకు ఎదురైన అవమానాలపై లోలోన ఆగ్రహించి ఉండవచ్చు. అమెరికా భారతదేశం మధ్య చాలా ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయి. అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నిలుపుకోవాలని కూడా భారతదేశం కోరుకుంటోంది. అయితే జపాన్ కు చెందిన షిగేరు ఇషిబా, ఇటలీకి చెందిన జార్జియా మెలోని మాదిరిగా ట్రంప్ ముందు సాగిలపడాలని ఏ భారతీయ నాయకుడు అనుకోరు అన్నది సుస్పష్టం. అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ చిన్న వెనుకడుగు వేశారు. బాండ్ మార్కెట్లో జరిగిన పరిణామాలు ఆయన తన నిర్ణయం 90 రోజులపాటు వాయిదా వేసుకునేలా చేశాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సంఘటనలు ఊహించదగినవే. చైనాకు సంబంధించినంత వరకూ వ్యూహం ఎంతవరకూ స్థిరంగా ఉంటుందో చూడాలి. చైనా ప్రెసిడెంట్ జీ జిన్‌పింగ్ ఉద్దండుడు. ఎదురులేని నాయకుడు. మిగతా ప్రపంచ దేశాలకు కొంత ఊరట కల్పించిన ప్రెసిడెంట్ ట్రంప్ చైనాను ఆకట్టుకునేందుకు మారిన నిబంధనలతో మరో పటిష్టమైన వ్యూహం కనుగొనాలి. ట్రంప్ 90 రోజుల సడలింపు ఏకపక్షం. దానికి రోడ్ మ్యాప్ ఏదీలేదు. ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్, ఆయన సలహాదారుల బృందం ఒక ప్రణాళిక ప్రకారం నిర్ణయాలు చేస్తున్నారని అభిప్రాయం గొప్పగా ఉంటుంది కానీ, నిజానికి అదో స్పష్టమైన అబద్ధం. సుంకాలపై ట్రంప్ ప్రకటించిన 90 రోజుల విరామం అనిశ్చితిని పెంచుతుంది. ఆర్థిక కార్యకలాపాలు అన్నీ అంచనాలపై ఆధారపడే సాగుతాయి. అనిశ్చితి అంచనాలను తారుమారు చేస్తుంది. కంపెనీలు, సంస్థలు దేశాలు కూడా అప్రమత్తంగా ఉండేటట్లు చేస్తుంది. ట్రంప్ విధించిన 90 రోజుల వాయిదా అనిశ్చితిని పెంచుతుందే కానీ, పరిస్థితిని చక్కదిద్దదు. దేశాలు ఎలాంటి దిద్దుబాటు చర్యలు తీసుకున్నా.. ప్రపంచవ్యాప్తంగా ఆర్థికమాద్యం ప్రమాదం ఉండనే ఉంది. ట్రంప్ తన విధ్వంసకర సుంకాల విధానం ద్వారా రెండు లక్ష్యాలను సాధించాలని ఆశిస్తున్నారు. మొదటిది అమెరికాలో ఉత్పాదకత పెంచే సంస్థల పునరుద్ధరణ, అలాగే అమెరికన్లు కోల్పోయిన బ్లూ కాలర్ ఉద్యోగాలను తిరిగి పొందేలా చేయడం. రెండవది ప్రపంచ వాణిజ్య వ్యవస్థలో చైనా లాభపడి పైచేయి సాధించకుండా చూడడం. యుఎస్‌లో ట్రంప్‌కు గల రాజకీయ మద్దతు నేపథ్యంలో దేశీయ ఉత్పాదకత పెంచే సంస్థల ప్రోత్సాహం చాలా ముఖ్యం. రెండో లక్ష్యం నెరవేరడం కొంత కష్టం. దేశంలో కొత్తగా ఉద్యోగాలు పెరగకుండా, కేవలం అన్ని ఉత్పత్తుల ధరలు పెరిగిపోతే చైనాకు నష్టం కలిగించడం వల్ల వచ్చే ప్రయోజనం ఏమిటన్నది ప్రశ్న. సమస్య ఏమిటం, ట్రంప్ మొదటి లక్ష్యాన్ని సాధించడం. దేశ ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడం, రెండో లక్ష్యమైన చైనాను దెబ్బ తీయడం చాలా కష్టం. ట్రంప్ వ్యూహాలను ఎదుర్కొనేందుకు మరో పక్క చైనా సంసిద్ధంగానే ఉంది. రెండు దశాబ్దాలుగా చైనా భౌగోళిక -ఆర్థిక నియంత్రణకు సంబంధించిన వ్యూహాలపై అమెరికాకు పూర్తి ఎరుక ఉన్న నేపథ్యంలో చైనాకు అమెరికా విషయంలో ఏమి ఆశించాలో, ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవాలో అన్న స్పష్టమైన ఆలోచన ఉంది. అసలు ప్రశ్న ఏమిటం. ట్రంప్ పతనానికి అమెరికా సిద్ధంగా ఉందా.. దేశంలో సంస్థలను నెలకొల్పి, ఉత్పాదతకను పునరుద్ధరించడం పార్టీ చేసుకున్నంత సులభం కాదు. దీనికి ఎంతో సమయం అవసరం. ట్రంప్‌కు మద్దతుగా ఉన్న నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రెండు సంవత్సరాలు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉన్నా నిరాశ చెందరు. కానీ స్వల్పకాలిక ప్రణాళికలు, దీర్ఘకాలంలో సమకూరే ప్రయోజనాలు రాజకీయంగా లాభదాయకంకాదు. ట్రంప్ కు దేశీయంగా మద్దతు తగ్గితే ఆయన విదేశాంగ విధానం వల్ల సమకూరే ప్రయోజనం ఏమిటి.. మరింతకాలం గడువు పెరగడమేనా.. గత వారంరోజులుగా ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ వాణిజ్యం, ట్రంప్ విధిస్తున్న సుంకాలపైనే చర్చ జరుగుతోంది. ప్రధానంగా ఆర్థికవేత్తలే ఈ అంశాలపై వ్యాఖ్యానిస్తున్నారు. ట్రంప్ సుంకాల నిర్ణయాన్ని వాయిదా వేసిన నేపథ్యంలో అంతర్జాతీయ సంబంధాలలో దీర్ఘకాలిక పరిణామాలు ఎలా ఉంటాయో అర్థం చేసుకునేందుకు రాజకీయ విశ్లేషకులు రంగంలోకి దిగుతున్నారు. అతి ముఖ్యమైన పరిణామం మాత్రం అమెరికాపై అంతర్జాతీయ దేశాలు నమ్మకం కోల్పోవడం. డొనాల్డ్ ట్రంప్ తన చర్యలన్నింటినీ వెనక్కి తీసుకుని, తన ప్రకటనలను, మాటలను దిగమించినా, ప్రపంచవ్యాప్తంగా కొద్ది మంది ప్రభుత్వాధినేతలు తప్ప ట్రంప్ పరిపాలనను ఇకపై ఎవరూ విశ్వసించరు. ట్రంప్ బాహాటంగా టార్గెట్ చేసి, స్పష్టంగా దూరం చేసుకున్న దేశాలలో కెనడా, మెక్సికో, డెన్మార్క్, దక్షిణాఫ్రికా ముఖ్యమైనవి. ఆ తర్వాత ట్రంప్‌ను బహిరంగంగా విమర్శించేందుకు సిద్ధమైన నాయకులు ఉన్న దేశాలలో బ్రెజిల్, కొలంబియా, జర్మనీ, ఫ్రాన్స్, సింగపూర్, నమీబియా, ఆస్ట్రేలియా ఉన్నాయి. అయితే, ఇప్పటివరకూ ట్రంప్ పట్ల ప్రపంచవ్యాప్తంగా పూర్తిస్థాయి లో అసమ్మతి వ్యక్తం కాలేదు. యురోపియన్ యూనియన్ దేశాలలో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మెజారిటీ దేశాలు మాత్రం అమెరికాను ఇకపై విశ్వసించవు. యురోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డేర్ లేయన్ వివిధ దేశాలపై విధించిన ప్రతీకార సుంకాలను 90 రోజులపాటు వాయిదా వేయడాన్ని స్వాగతించారు. అదే సమయంలో యురోపియన్ యూనియన్ తమ అంతర్గత మార్కెట్‌ను మరింత విస్తృతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యురోపియన్ యూనియన్ చైనాతో వాణిజ్య సంబంధాలను సజావుగా కొనసాగిస్తోంది. ముమ్ముందు భారతదేశంతోనూ, ఇతర దేశాలతోనూ వాణిజ్య సంబంధాలు పెంచుకోవచ్చు. జపాన్ పరిస్థితి మరోలా ఉంది. జపాన్ అమెరికా బాండ్ మార్కెట్‌లో అమ్మకాలు చేయడం ద్వారా 90 రోజుల వాయిదాను తిప్పికొట్టి ఉండవచ్చు. జపాన్ కూడా చైనాతో వాణిజ్య సంబంధాలను మరింత పెంచుకోవచ్చు. భారత రాజకీయ నాయకత్వం మాత్రం ఆచీతూచీ అడుగులు వేస్తోంది. ట్రంప్ దాడి ప్రధానంగా చైనాపై ఉండడం పట్ల సంతోషంగానే ఉంది. అమెరికా నుంచి మరిన్ని రక్షణ పరికరాలతో పాటు, కీలక ఉత్పత్తులు కొనుగోలు చేయడానికిఆఫర్ చేయడం ద్వారా ట్రంప్‌తో పలు వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకునేందుకు సిద్ధపడుతోంది. అయితే, ట్రంప్ మొదటి పదవీకాలంలో ఉన్నంత సన్నిహితంగా నరేంద్రమోడీ ట్రంప్‌తో వ్యవహరిస్తారా అన్నది చూడాలి. ఎందుకంటే ట్రంప్ దాదాపు డైరెక్టుగానే భారత దేశంతో అంత సన్నిహిత స్నేహసంబంధాలు లేవని పదేపదే అంటూ, మోడీకి ఖేదం కలిగిస్తున్నారు. ట్రంప్ భారతదేశం గురించి చెడుగా, కాస్త తక్కువచేసి మాట్లాడడాన్ని భారతదేశంలోని ఉన్నత వర్గాలు, మీడియా, రాజకీయ వర్గాలు కూడా పెద్దగా పట్టించుకోలేదు. దీనిపై వివరణ ఇచ్చేందుకు సిద్ధపడినవారూ ఉన్నారు. మోడీ వంటి ఆత్మాభిమానం గల, స్వీయంగా ఇమేజ్ గల నాయకుడు తనకు ఎదురైన అవమానాలపై లోలోన ఆగ్రహించి ఉండవచ్చు. అమెరికా భారతదేశం మధ్య చాలా ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయి. అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నిలుపుకోవాలని కూడా భారతదేశం కోరుకుంటోంది. అయితే జపాన్‌కు చెందిన షిగేరు ఇషిబా, ఇటలీకి చెందిన జార్జియా మెలోని మాదిరిగా ట్రంప్ ముందు సాగిలపడాలని ఏ భారతీయ నాయకుడు అనుకోరు అన్నది సుస్పష్టం. భారత ప్రధాని మోడీ ఇంతవరకూ మౌనం వహించారు. బహుశా అమెరికాతో వాణిజ్య ఒప్పందాలపై జరుగుతున్న చర్చలు ఇంకా పురోగమదిశలో ఉండడమే కారణం కావచ్చు. దీంతో ఇతర ప్రపంచ దేశాలకు స్పందించే అవకాశం వచ్చింది. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల ఆందోళనలను ఎత్తిచూపుతూ, సంఘీభావం వ్యక్తం చేసేందుకు చైనా సంసిద్ధమైంది. ఈ విషయంలో భారతదేశాన్ని కలుపుకుపోవడానికి ముందడుగు వేసింది. చైనాతో పాటు బ్రెజిల్, దక్షిణాఫ్రికా నాయకులు ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశాయి. ఇక భారతదేశం నుంచి స్పష్టమైన ప్రకటన కోసం ప్రపంచం ఎదురు చూస్తోంది.